నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నమ్మలేని నిజాలు

గంజి మెతుకు
విందు భోజన ఆశ
స్వప్న వమనం.

బడి నడక
రోడ్లు మూగ పోయాయి
మళ్లీ దారిలో.

నాసిక వ్యాక్సిన్
కోవిడ్కి కొత్తకోణం
విజయపథం.

బల్లెం విసురు
విశ్వఖ్యాతి తెచ్చింది
పైడి పతకం.

ఖాళీ జేబులు
తాగడంలో రాజులు
ఉచిత హస్తం.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

హింస కామం చెలరేగె
రెచ్చిపోయి మద్యానికి
మత్తు పదార్థాల మీద
ఆదాయం రాజ్యానికి

ఆరేళ్ళ బాలిక మీద
హత్యాచార ఘటన !
వినీ చూసిచూడనట్లు
ప్రభుత బాధ్యత నటన !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 16-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 42 | పేజీలు:6 | వెల: రూ.1/-

తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి

రూ. 750 కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చిన మలబార్ గ్రూప్
తెలంగాణలో గోల్డ్ మరియు డైమండ్ జ్యువెలరీ తయారీ ఫ్యాక్టరీ
2500 మందికి పైగా నైపుణ్యం కలిగిన స్వర్ణకారులకు ఉపాధి అవకాశం
మలబార్ గ్రూప్‌కు మంత్రి కేటీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు

హైదరాబాద్ , సెప్టెంబర్ 15:తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వచ్చింది. జ్యువెలరీ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గడించిన దేశీయ దిగ్గజం మలబార్ గ్రూప్ తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. తెలంగాణలో ఉన్న వ్యాపార అనుకూలతలతో పాటు తమ కంపెనీకి అవసరమైన నాణ్యమైన మానవ వనరులు ఉన్నాయన్న మలబార్ గ్రూప్ తెలిపింది. తమ గ్రూప్స్ కు అంతర్జాతీయంగా 260 స్టోర్స్ ఉన్నాయని, తెలంగాణలో తాము ప్రతిపాదిస్తున్న పెట్టుబడి ద్వారా తమ కంపెనీ జ్యువెలరీ మాన్యుఫాక్చరింగ్ విభాగం మరింత బలోపేతం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. మొత్తం రూ. 750 కోట్ల పెట్టుబడిని తెలంగాణలో పెట్టనున్నట్టు, ఈ పెట్టుబడి ద్వారా గోల్డ్, డైమండ్ జ్యువెలరీ తయారీ ఫ్యాక్టరీ, గోల్డ్ రిఫైనరీ యూనిట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. తమ పెట్టుబడితో సుమారు 2500 మంది నైపుణ్యం కలిగిన స్వర్ణకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మలబార్ గ్రూప్ తెలిపింది.

మంత్రి కేటీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు

తెలంగాణ ప్రభుత్వము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను దృష్టిలో ఉంచుకొని, ఇక్కడున్న వ్యాపార అనుకూలతలను పరిగణనలోకి తీసుకొని పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిన మలబార్ గ్రూప్‌కు మంత్రి కేటీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పెట్టుబడి ద్వారా 2500 మంది నైపుణ్యం కలిగిన స్వర్ణ కారులకు ఉపాధి అవకాశాలు లభించడం అత్యంత సంతోషాన్ని ఇచ్చే విషయమని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో ఈ వృత్తిలో కొనసాగుతూ అద్భుతమైన కళా నైపుణ్యం కలిగిన స్వర్ణకారులు తెలంగాణలో పలు జిల్లాల్లో ఉన్నారని, కంపెనీ ఇచ్చే ఉద్యోగాల్లో వీరందరినీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. మలబార్ గ్రూప్ తమ పెట్టుబడికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం వైపునుంచి అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో కంపెనీ సీనియర్ ప్రతినిధి బృందంతో పాటు, తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ , సెప్టెంబర్ 15: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ క్రీడల అభివృద్ధికి పెద్ద పీట వేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

మంత్రి నివాసంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో అక్టోబర్ 2, 3వ తేదీలలో నిర్వహిస్తున్న బాక్స్ క్రికెట్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో క్రీడా మైదానాలను నిర్మిస్తున్నా మన్నారు.

తెలంగాణ క్రీడా హబ్‌గా రూపొందించేందుకు క్రీడా పాలసీని తయారు చేస్తున్నామన్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈవెంట్ ఇండస్ట్రీ అధ్యక్షురాలు రాఖీ కనారియా, జాయింట్ సెక్రటరీ తౌఫిక్, అర్జే చేతన్, సౌరభ్ డగా, ప్రకాష్, షైనీ, నగేష్ తదితరులు ఉన్నారు.

పేదలకు రోగమొస్తే సీఎం సహాయనిధితో ఆర్థిక చేయూత : సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 15: ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి పెన్నిధి వంటిదని, సంక్షేమ కార్యక్రమాలకు తెలంగాణ సర్కారు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం మండల పరిధిలోని కల్వకోల్‌కు చెందిన గడ్డం కృష్ణ ఆరోగ్యం బాగలేకపోవడంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా అతనికి 60వేల రూపాయలను మంజూరు చేసారు. ఆ చెక్కును నగరంలోని మంత్రి నివాసంలో గ్రామ సర్పంచ్ థామస్ రెడ్డితో కలిసి అందజేశారు.

అలాగే జల్‌పల్లి మున్సిపల్ కేంద్రానికి చెందిన పెంటయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యం బారిన పడ్డారు. ప్రైవేట్ దవాఖానాలో చికిత్స తీసుకున్నాడు. అధిక ఖర్చు కావడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆమె కుటుంబ సభ్యులు జల్‌పల్లి కోఆప్షన్ సభ్యుడు సూరెడ్డి కృష్ణారెడ్డి, టీఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యంజాల జనార్దన్ దృష్టికి తీసుకెళ్లారు.వారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. రూ.60 వేలు మంజూరు కావడంతో ఆ చెక్కును మంత్రి బుధవారం ఆమె నివాసంలో బాధితుడి సతీమణికి అందజేశారు.

మహిళ సంఘాలకు రూ. 2.13 కోట్ల చెక్కులు అందజేసిన మంత్రి హరీశ్ రావు

కరీంనగర్ జూన్ 15(నేటినిజం ప్రతినిధి): ఒకప్పుడు సర్కారు దవాఖానకు పోవాలంటే నేను రాను బిడ్డో..అని పాడుకునేది. కానీ దవాఖానాల్లో వసతులు పెరగడంతో పాటు కేసీఆర్ కిట్ తో పోదాం పావే బిడ్డో అని సంబురపడుతున్నారని ఆర్థికశాఖమంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గం జమ్మికుంట పట్టణంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ ఆవరణలో జరిగిన స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, మాజీమంత్రి పెద్దిరెడ్డి, కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావులతో కలిసి ఆయన మహిళ సంఘాలకు రూ. 2 కోట్ల 13 లక్షల 48 వేల చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మిగతా గ్రూపులకు రూ. కోటి 50 లక్షలను కూడా బతుకమ్మ పండుగ లోపు అందజేస్తామన్నారు.

పేదింటి ఆడపిల్ల పెళ్లి కోసం కళ్యాణలక్ష్మీ పథకం ప్రవేశపెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. రూ. 50 వేలతో కళ్యాణ లక్ష్మీ పథకం ఎస్సీలతో ప్రారంభించి.. ఇవాళ అన్ని వర్గాల పేదలకు రూ. లక్షా 116 ఇస్తున్నామని తెలిపారు. 200 రూపాయలున్న ఆసరా పెన్సన్‌ను 2016 చేశామన్నారు. రాబోయే రోజుల్లో 57 ఏండ్లు నిండిన 4 లక్షల మందికి పెన్షన్లు ఇవ్వనున్నామన్నారు. ఆసరా పెన్సన్ తో వృద్ధులకు భరోసా దొరికితే?కొడలుకు అత్తే ఆసరా అయిందని, వృద్ధులు, వితంతువుల ఆత్మగౌరవం పెరిగిందని వాళ్ళను ప్రభుత్వం కడుపులో పెట్టుకుని చూసుకుంటోందన్నారు.రెండెండ్లలో ఇంటింటికి నల్లా పెట్టి మన అక్కాచెల్లెండ్ల బాధ తీర్చినమని హరీశ్‌రావు అన్నారు. జమ్మికుంటలో మహిళల కోసం కుటీర పరిశ్రమలు ప్రారంభించుకుందాం, దానికోసం ప్రత్యేక కార్యాచరణ తీసుకొస్తామని తెలిపారు. ఢిల్లీలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏమిచ్చిందో ఆలోచించాలని, ధరలను పెంచుతుంది ఎవరో పేద ప్రజలను ఆదుకుంటోంది ఎవరో ఆలోచించాలని మంత్రి కోరారు. తెలంగాణలో ప్రతి మంత్రికి సీఎం కేసీఆర్ 4 వేల ఇండ్లు ఇచ్చారు. పైసా ఖర్చు లేకుండా పేదలను ఇండ్లలోకి పంపించాము.హుజురాబాద్ నియోజకవర్గానికి 5 వేల ఇండ్లు ఇస్తే.. 5 ఇండ్లు అయినా కట్టరా అని ఆయన ప్రశ్నించారు. పెండింగ్ లో ఉన్న ఇండ్లను పూర్తి చేస్తామని, జాగా ఉన్న వాళ్లకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణ వచ్చాక లక్షా30 వేల ఉద్యోగాలు ఇచ్చాము.. మరో 50-60 వేల ఉద్యోగాలు ఇవ్వబోతున్నామని తెలిపారు. జమ్మికుంట అభివృద్ధికి రూ. 35 కోట్లు ఇచ్చాము.. ఇతర పనులకు కూడా నిధులు ఇచ్చుకుందామన్నారు.నాయిని చెరువును సుందరంగా తీర్చిదిద్దుతాం.వ్యక్తికి లాభం జరిగితే మనం నష్టపోతాం.. పని చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి అని హరీశ్‌రావు కోరారు.మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను, అన్ని రంగాలను అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ పని చేస్తున్నారు. ఎం కేసీఆర్ మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా ఇంటింటికి మంచినీరు అందిస్తున్నారు. ఒకప్పుడు గోదావరి నీళ్లు కావాలంటే గోదావరి దగ్గరికి వెళ్లాల్సి వచ్చేది.. ఇప్పుడు గోదావరిని ఇళ్ల వద్దకు తాగునీటి కోసం తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్ ది అన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ ఇజ్జగమున దళితులపక్షపాతి
బాబ్జాబూరకేమ గాంచి పూనికతోడనే
జజ్జనకరె దుమ చుమ కుల
గజ్జల పోర్రల చూచె కల్పతరు సుచుచున్॥

–బుద్ధశ్రీ

(సెప్టెంబర్ 16 బొజ్జా తారకం పుట్టినరోజు..) సెల్: 9494481210

చైత్రను హతమార్చిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం : మంత్రి సత్యవతి

మహబూబాబాద్, సెప్టెంబర్ 15:: సైదాబాద్ కాలనీలో చిన్నారి చైత్రపై లైంగికదాడి చేసి, హత్య చేయడం దారుణమని, అత్యంత దురదృష్టమనీ గిరిజన, స్త్రీ & శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

ఈ ఘటన జరిగిన రోజు నుంచి ప్రతి రోజూ డీజీపీ సీపీలతో మాట్లాడుతున్నానని చెప్పారు. పది పోలీస్ బృందాలు నిందితుడి కోసం గాలిస్తున్నాయని, కచ్చితంగా దోషులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో నూతన మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం నిర్మాణం పనులు, మెడికల్ కాలేజీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మహబూబాబాద్ మెడికల్ కాలేజీ కార్యరూపం దాల్చడంలో నేను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు.

అధికారులు అంతా ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. నిర్మాణ పనులు త్వరగా కావాలని ఆర్ అండ్ బి కి అప్పగించాం. రూ.30 కోట్లతో నర్సింగ్ కాలేజీకి టెండర్ పూర్తి అయ్యిందని మంత్రి తెలిపారు.

నర్సింగ్ కాలేజీ పూర్తి చేశాక అందులో ముందు మెడికల్ కాలేజీ నడిపిస్తాం. ఏరియా హాస్పిటల్ లో 300 పడకల ఏర్పాటు చేశాం. అన్ని సర్వీసులు అక్కడ స్టార్ట్ చేస్తున్నామని పేర్కొన్నారు.

అందరికీ ఆదర్శం అన్నాదురై!



"తమిళ రాజకీయ రంగంలో అతనొక తార! సితార! మిళ మిళ మెరిసే ధ్రువతార! అన్నాదురై నామ స్మరణ లేని తమిళ రాజకీయాలను ఇప్పుడే కాదు, ఎప్పుడూ, ఎప్పటికీ, కూడా మనం ఊహించలేము. "భారతదేశంలో సినీరంగం నుండి సీఎం అయిన మొదటి వ్యక్తి "కంజీవరం నటరాజన్ అన్నాదురై."

నిత్యం ప్రతి నోట, తమిళ నాట, సభల్లో, సమావేశాల్లో, ఎక్కడైనా, ఏ చోటనైనా, ఏ చాటు నైనా, తలచే పేరు, వినిపించే పేరు .... అన్నా ... అన్నా ... అన్నా .... అన్నాదురై.

కరుణానిధి, ఎం జి ఆర్ లు డీఎంకె పార్టీ సభ్యులు. అన్నాదురై అనంతరం మొదట కరుణానిధి తరువాత ఎంజీఆర్ లు ముఖ్యమంత్రులు అయ్యారు. వీరు ఇరువురికీ అన్నాదురై రాజకీయ గురువు. జయలలిత కూడా ఈ పరంపరలోనే ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ముగ్గురికి మరి నేడు తమిళనాడును పరిపాలిస్తున్న ముఖ్యమంత్రులకు మంచి పునాది వేసినవారు అన్నాదురై.

ఎన్టీఆర్ కు కూడా స్ఫూర్తి అన్నాదురై మరియు అతని సంక్షేమ పథకాలు, భాషాభిమానం.

వీరందరి రాజకీయ బంగారు భవిష్యత్తుకు మార్గం కనుగొన్న మార్గదర్శి అన్నాదురై.

తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసి, భవిష్యత్ తరాల వారికి స్ఫూర్తి దాయకుడిగా మార్గదర్శిగా నిలిచిన తమిళ ప్రజల ఆరాధ్య దైవం అన్నాదురైగారు.

అందమైన పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన,
అద్భుత శిల్పకళా నైపుణ్యంతో శోభిల్లే దేవాలయాలతో అలరారే కాంచీపురంలో
దిగువ మధ్యతరగతి చేనేత కుటుంబంలో
ఒక చిన్న ఇటుకల ఇంట్లో 15-9-1909 న ఒక అద్భుతమైన సంఘటన జరిగింది ...

'బెత్లెహేము' లోని పశువుల పాకలో రక్షకుడు ఏసు జన్మించినట్లు చిన్న యిటుకల యింట్లో "ద్రవిడ సంస్కృతి పరిరక్షకుడు" "బహుజన ఉద్ధారకుడు" ఒక అద్భుత బాలుడు జన్మించారు.

అతనే అన్నాదురై ..అతని పుట్టుక అట్టడుగు వర్గాల ఉద్ధరణకు, భారత రాజకీయాలలో పెనుమార్పులకు కారణమవుతుందని ఆనాడు ఎవరూ కూడా ఊహించి ఉండరు.

అభ్యుదయ భావాలతో ద్రవిడ ఉద్యమాలకు కేంద్రబిందువు అయ్యారు. అత్యంత ప్రజాదరణ గల భారత నాయకుడయ్యారు.

దశాబ్దాలు, శతాబ్దాలు గడిచినా ప్రజలు నిత్యం స్మరించుకునే ప్రజా నాయకుడు అయ్యారు. దక్షిణాదిన చాలా బలమైన నాయకుడిగా స్వయం కృషితో ఎదిగి ముఖ్య మంత్రి అయ్యారు.

తండ్రి నటరాజన్ మొదలియార్ గారు వీవర్. అంటే తమిళ సెంగుట్టర్. చేనేత సామాజిక వర్గానికి చెందిన వారు. తల్లి బంగారు అమ్మాల్ .. సాధారణ గృహిణి. కుటుంబ ఆర్థిక పరిస్థితుల వలన కొన్నాళ్లు చదువుకు దూరంగా ఉన్నారు అన్నాదురై.

ఆ సమయంలోనే కాంచీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా చేరారు. కొన్నాళ్లు పని చేశారు. కుటుంబ పరిస్థితులు కుదుటపడిన తర్వాత పచ్చయప్ప కళాశాలలో బి.ఏ ఆనర్స్ పూర్తి చేశారు.

అటు పిమ్మట తనకు యిష్టమైన సబ్జెక్ట్ లు ఎమ్మే ఎకనామిక్స్, ఎమ్మే పాలిటిక్స్ లను ఇష్టముగా చదివి పట్టా పుచ్చుకున్నారు.

అన్నాదురై బాల్యము నుండి చురుకైన వాడు. మిక్కిలి ప్రతిభావంతుడైన విద్యార్థి. ప్రతిభా పురస్కారాలు స్కాలర్షిప్పులు అందుకునే వాడు.

కొంతకాలం పచ్చయప్ప పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్ గా కూడా పని చేశారు. ఆంగ్ల పుస్తకాలను చదవడం హాబీ. ఆంగ్ల భాషలో అద్భుత ప్రావీణ్యం ఉంది. అన్నాదురై మంచి పుస్తక ప్రియులు. ముఖ్యమంత్రిగా పాలనా వ్యవహారాల్లో ఎంత బిజీగా ఉన్నా మంచి పుస్తకాలు చదవటం మానేవాడు కాదు.

1940 లో బాబా సాహెబ్ అంబేద్కర్ పెరియార్ రామస్వామిల సమావేశంలోను, వివిధ సభలు, సమావేశాల్లో అనువాదకుడిగా వ్యవహరించేవారు.

ఆర్థికంగా కొద్దిగా స్థిర పడిన తర్వాత టీచర్ జాబ్ మానివేశారు. తనకు అత్యంత ప్రీతి పాత్రమైనది పాత్రికేయ వృత్తి. అందులో ప్రవేశించారు. అనేక తమిళ రాజకీయ పత్రికలకు సంపాదకుడిగా పనిచేశారు.

చిన్నతనం నుండి తమిళ భాషపై, యాస పై మంచి పట్టుంది. మంచి వక్త. కథ మరియు నాటక రచయిత.

అన్నాదురై కవితలు, కథలు, నవలలు, నాటకాలు అనేకం రాశారు. ప్రజలను చైతన్యం చేసే, మంచి సందేశం యిచ్చే, స్ఫూర్తి నిచ్చే నాటకాలు రాయడంలో మంచి దిట్ట. ఉత్తమ నటుడు కూడా. వీరి నాటకాలు కొన్ని తర్వాత సినిమాలుగా కూడా వచ్చాయి. అనేక తమిళ చిత్రాలకు కథ, మాటలు రాసి స్క్రీన్ ప్లే సమ కూర్చే వారు. తమిళ సినిమా రంగంలో విజయాలను అందించే రచయితగా స్థిరపడ్డారు. పంచ్ డైలాగులు రాయడంలో చెప్పడంలోను ప్రసిద్ధులు. సినిమా హాళ్లు, సభలు సమావేశాలు చప్పట్లతో దద్దరిల్లి పోయేయి.

విశాలమైన నుదురు,మెరిసే కళ్ళు, పొడవైన ముక్కు, ఆకుతో తడిసిన పళ్ళు, వత్తయిన జుట్టు, నగు మోము చూపరులను ఇట్టే ఆకర్షిస్తే చేసమ్మోహన రూపం. రూపానికి తగిన వాగ్ధాటి. తన వాగ్ధాటితో ఎలాంటివారినైనా ఆకట్టుకుంటారు. తన భావ జాలంతో మంత్ర ముగ్ధులను చేస్తారు.

అన్నాదురై జననంలోను, పెరగటంలోను అవతార పురుషుల లక్షణముంది.

అన్నాదురై తల్లిదండ్రులది ఆదర్శనీయమైన కులాంతర వివాహం. అన్నాదురై చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. దేవకి తనయుడు అవతార పురుషుడు శ్రీ కృష్ణుని యశోద పెంచి పెద్ద చేసినట్లుగ అన్నాదురైని అతని పిన్ని రాజ మణి అమ్మాళ్ పెంచి పెద్ద చేసింది.

21 ఏళ్ల వయసులోనే 1930 లో అన్నాదురై విద్యార్థిగా ఉన్నప్పుడే రాణితో పెళ్లి అయింది. రాణి ఆదర్శ గృహిణి. ఉత్తమ ఇల్లాలు. భర్త పట్ల అత్యంత ప్రేమ గలది. అన్నాదురై ఆలోచనలు అర్థం చేసుకుని బాగా సహకరించేది.

ఎన్ని ఏండ్లు గడిచినా అన్నాదురై దంపతులకు సంతాన భాగ్యం కలుగలేదు. అన్నాదురైని పెంచి పెద్ద చేసిన పిన్ని గారి మనవలు ఇలంగోవన్, గౌత మాన్, బాబులను దత్తత తీసుకొని పెంచారు.

రాణి అమ్మాల్ అన్నాదురై కి అతని చదువుకి, అతని పనికి, రాజకీయ జీవితానికి చాలా సహకరించారు. అతను అర్ధ రాత్రి వరకు పుస్తకాలు చదువుతున్నప్పుడు ఏ మాత్రం ఇబ్బంది పెట్టే వారు కాదు. అతను ప్రజా సేవలో దేశ సేవలో ఉన్నాడని గర్వించేది. అన్నాదురై ఆశయసాధనకు ఆమె అన్ని రకాలుగా సహకరించేది.

1938లో అన్నాదురైని మొదటి సారి అరెస్టు చేసినప్పుడు ఆమె కొద్దిగా భయపడింది.

కానీ తరచుగా జైలులో భర్తని సందర్శించేది. అన్నాదురై పాత్రికేయునిగా ప్రజల మధ్యన తిరిగేవాడు. పత్రికల్లో రాసేవాడు. పేద ప్రజల కష్టాలు, కుల వివక్షత, సకల జనులకు సమాన అవకాశాలు లేకపోవడం, ధనవంతులు మరింత ధనవంతులు కావడం, పేదలు మరింత పేదలు కావడం అతన్ని బాగా ఆలోచింప జేసింది. సకల సమస్యలను పరిష్కరించేది, ప్రజలకు మేలు చేసేది, చేయగలిగేది ప్రజల జీవితాలు మెరుగు పరిచేది రాజ్యాధికారమేనని తెలుసుకున్నారు.

క్రమ క్రమంగా అన్నాదురై ఆలోచనలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజలకు మేలు చేసే రాజకీయాల వైపు మళ్ళాయి.

తన భావాలకు తగిన విలువనిచ్చే పార్టీలో చేరి రాజకీయాల్లో పాల్గొనాలని గట్టిగా నిర్ణయించు కున్నారు.

పాతికేళ్ళ వయసులోనే 1934 లో తిరువూరు వద్ద పెరియార్ రామస్వామి గారిని మొదటి సారి కలుసుకున్నారు. వారిని తన నాయకుడిగా అంగీకరించారు.

ఇరవై ఆరేండ్ల వయస్సులో 1935 లో జస్టిస్ పార్టీలో చేరారు. అప్పుడు జస్టిస్ పార్టీ కి అధ్యక్షులుగా పెరియార్ రామస్వామి గారున్నారు.

స్వతహాగా ప్రతిభావంతుడు అయిన
అన్నాదురై త్వరిత గతిన పార్టీలో అత్యంత
కీలకమైన వ్యక్తిగా ఎదిగారు.

పెరియార్ కు సన్నిహిత అనుయాయిగా అయ్యారు అన్నాదురై.

అన్నాదురై కొన్నాళ్లు "జస్టిస్"మ్యాగజైన్ కు సబ్ ఎడిటర్ గా కూడా పని చేశారు.

మరి కొన్నాళ్ళకు "విదుతలై" పత్రికకు సంపాదకుడిగా ఉంటూ తమిళ వార పత్రిక "కుడి అరసు" తో కూడా స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉన్నారు.

"ద్రవిడ నాడు" అనే సొంత పత్రికను కూడా ప్రారంభించినారు.

ఒకవైపు పత్రికారంగం, మరొకవైపు సినిమా రంగం, ప్రజలను ఉర్రూతలూగించే ఉపన్యాసాలు ఇద్దరు కలసి తమిళ ప్రజలను రాజకీయాలను బాగా ప్రభావితం చేశారు.

బ్రాహ్మణ ఆధిపత్య వ్యతిరేకత, నాస్తికత్వం, హేతువాదం, కుల వివక్షత నిర్మూలనం కోసం కలిసి పనిచేశారు.

అన్నాదురై పెరియార్ లు మంచి గురు శిష్యులయ్యారు. ద్రవిడ భాష, సంస్కృతుల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేశారు. త్రిభాషా సూత్రం ప్రకారం హిందీని బలవంతముగా అమలు చేయడాన్ని వ్యతిరేకించారు. మరి కొన్నాళ్ళకు గురు శిష్యుల మధ్యన సిద్ధాంత పరమైన విభేదాలు ఏర్పడ సాగాయి.

భారతదేశానికి స్వాతంత్రం వచ్చినీది. స్వాతంత్ర దినోత్సవాన్ని శోక దినంగా అభివర్ణించారు పెరియార్ రామస్వామి.

ద్రవిడ రాష్ట్రం భారత్ యూనియన్లో విలీనంపై ఇద్దరి మధ్యన తలెత్తిన విభేదాల కారణంగా తన గురువు పెరియార్ తో విభేదించినారు.

పెరియార్ పిన్న వయస్కురాలైన మణియమ్మను పెళ్లి చేసుకోవడంతో యిక తన అనుచరులతో బయటకు వచ్చారు అన్నాదురై.

రావిపురం లోని రాబిన్సన్ పార్కులో సెప్టెంబర్ 17, 1949 న "ద్రవిడ మున్నేట్ర కజగం" పార్టీని అన్నాదురై స్థాపించారు. భారత దేశ రాజకీయాలను మలుపు తిప్పే సంఘటనా సన్నివేశం అది.

ప్రస్తుతం భారత దేశ రాజకీయాల్లో అత్యంత ప్రభావం చూపుతున్న ద్రవిడ పార్టీలకు మూలపురుషుడయ్యారు.

ద్రావిడ ఉద్యమాలలో పాల్గొని అనేకమార్లు జైలుపాలయ్యాడు. 1938 లో పెరియార్ నాయకత్వంలో జరిగిన మొదటి హిందీ వ్యతిరేక ఆందోళనలో పాల్గొన్నందుకు గాను నాలుగు నెలల జైలు శిక్ష అనుభవించారు.

1944 సేలం లో జస్టిస్ పార్టీ ని "ద్రవిడ కజగం" అని పేరు మార్చడానికి అన్నాదురై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 35 గంటలు నిరంతరాయ సుదీర్ఘ చర్చ తరువాత అంగీకరించబడింది. .

1950 లో ''ఆర్య మాయ'' అనే పుస్తకాన్ని రచించినందుకు గాను ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించారు.

1952 సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే పాల్గొనలేదు.

1956 మే లో తిరుచ్చిలో జరిగిన సమావేశంలో చర్చించి 1957 సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొన్నారు. అసెంబ్లీలో డీఎంకే 15 సీట్లను గెలుచుకొని సమర్థ వంతమైన ప్రతిపక్షంగా నిలిచి పని చేసింది.

1962 సార్వత్రిక ఎన్నికల్లో పూర్తి మెజారిటీ సాధించలేకపోయారు.

1963లో డీఎంకే పార్టీ "ద్రవిడ నాడు" డిమాండ్ ను వదిలి వేసుకున్నట్లు ప్రకటించబడినది.

అన్నాదురై 1952 నుండి 1957 వరకు శాసన సభ్యుడిగాను, 1962 నుండి 1967 వరకు రాజ్యసభ సభ్యుడిగాను పని చేశారు.

1967 నుండి 1969 వరకు "ముఖ్యమంత్రిగా" పని చేశారు.

1965లో తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళన అన్నాదురై కి బాగా కలిసి వచ్చింది. తన పార్టీకి ప్రజల మద్దతు పొందడానికి బాగా తోడ్పడింది.

ఒక ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి అంచలంచలుగా ఎదిగి, సొంతముగా ఒక పార్టీని స్థాపించి 1967 ఎన్నికల్లో 174 స్థానాలకు పోటీ చేసి 137 స్థానాలను గెలుచుకొని ముఖ్యమంత్రి కావడంతో అన్నాదురై ప్రతిభా సామర్థ్యాలు ఎలాంటివో సులభంగానే అర్థమవుతోంది.

1967 లో అన్నాదురై నాయకత్వంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేటి వరకు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ గెలవలేదు. ప్రభుత్వము ఏర్పడనూ లేదు.

అన్నాదురై 1940 నుండి భారతదేశం ఒక ప్రత్యేక ఖండమని, ప్రత్యేక తమిళ దేశం కోసం గట్టిగా డిమాండ్ చేశారు కూడా. కానీ 1962లో చైనా దురాక్రమణను చూసిన తర్వాత తన వేర్పాటు భావాలను వదిలేసుకున్నారు.

తన పరిపాలనా కాలంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారు.

పేదలకు "రూపాయకు పడి బియ్యం" పంపిణీ పథకం అమలు వలన బాగా మేలు జరిగింది. ఈ పథకం పేదలకు నచ్చింది. అన్నాదురై కి మంచి పేరు తెచ్చింది. ప్రజలకు ఆరాధ్య దైవం అయ్యారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మతపరమైన చిత్రాలను ప్రదర్శించకూడదని ఆదేశాలు జారీ చేశారు. తన రెండేళ్ల పాలనలోనే మద్రాస్ స్టేట్ ను తమిళనాడు రాష్ట్రం గా మార్చారు.

ప్రజల వద్దకు పాలన అన్నాదురైతో ప్రారంభమైందని చెప్పవచ్చు.

తరచూ తన పార్టీ నాయకులతో కార్యకర్తలతో
"ప్రజల వద్దకు వెళ్ళండి. వారితో కలిసి జీవించండి. వారికి సేవ చేయండి. వారి
నుండి నేర్చుకోండి. వారికి తెలిసిన వాటితోనే ప్రారంభించండి. వారి వద్దనున్న దానితో నిర్మించండి." అని చెప్పి ప్రజల వద్దకు పంపే వారు.

వీరు మొదట్లో బహిరంగ నాస్తికులు. అయినప్పటికీ తరువాత తన వైఖరి మార్చుకున్నారు. అ

నేటినిజం
సాహితీ కైరవాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 16-9-2021

నేటికవిత-కవిత్వ విశ్లేషణ

నేటికవితలో ఈ వారం: 'రెప్పలు మోయని దు:ఖం' అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు కవితలపై విశ్లేషణ

-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

విచార పర్వం

అది ప్రతిరోజూ నాలోని
కల్మషాలను కడిగేసి
తెల్లవార్లూ ఆరబెడుతుంది...
అది ఎప్పుడైనా ఓసారి
నా పచ్చిగాయాల మాన్పి
బాధలను మరిపించి
సేదతీరుస్తుంటుంది...
అది కనుపపల పై పొరగా
తొణికిసలాడుతున్న జలంతో
ఎండిన గుండెను తడుపుతుంటుంది..
అది పదుగురిలో స్వతంత్రతను
కోల్పోయి స్వేచ్ఛావాయువులను
ఒంటరిగానే ఆస్వాదించే విచారపర్వం...
అది కుమిలి కుమిలి ఏడిపించిన
భారాన్ని దింపేసి గాల్లో తేలేలా చేసిన
రెప్పలు మోయని దు:ఖం కథ...!

-యర్రాబత్తిన మునీంద్ర
83318844527

నెల్లూరు జిల్లా మంగా నెల్లూరుకు చెందిన కవి యర్రాబత్తిన మునీంద్ర గారు రెప్పలు మోయని దు:ఖం అంశంపై విచారపర్వం శీర్షికతో రాసిన కవితలో నర్మగర్భంగా హృదయాంతరాలలోని వేదనను ఆవిష్కరింప యత్నించారు. హృది భారాన్ని దింపేసి మనసు కుదుటపడేలా చేసేందుకు కుమిలి కుమిలి ఏడిపించి... సాంత్వన నిచ్చే కనురెప్పలు సదా దు:ఖాన్ని మోస్తాయన్న అర్థం ధ్వనించేలా, కవి మునీంద్ర గారు తమ భావాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. కనురెప్పల నుండి రాలే కన్నీటి చుక్కలు.. విచార పర్వానికి ప్రతినిధులై.. కల్మషాలను కడిగేసి.. తెల్లవార్లూ ఆరబెడతాయని ఎత్తుగడలోనే ప్రకటించారు. విచారపర్వంలో ఉన్నప్పుడు కాస్తంత ఊరట నివ్వడానికి.. మరికాస్త ఓదార్పు నివ్వడానికి కన్నీటికి జాలువారే కన్నీటి బిందువులు చెక్కిలిపై నర్తిస్తుంటే మోయలేని భారం నుండి కాస్తంతైనా ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు.

మోయలేని దు:ఖాన్ని కళ్ల గడప దాటించేవీ కనురెప్పలేనన్న అర్థం వచ్చేలా తెలియజెబుతూ.. అవి పచ్చి గాయాలను మాన్పి బాధలను మరిపించి సేదతీరుస్తాయని వివరించారు.

విచారపర్వంలో మనసు మునిగి ఉన్నప్పుడు కనుపాపలపై పొరగా తొణికిసలాడుతున్న జలంతో ఎండిన గుండెను తడుపుతుందని కొనసాగించారు. రెప్పలు మోయలేని దు:ఖానికి మూలం విచారపర్వమేనని పేర్కొన్నారు. పదుగురిలో స్వతంత్రతను కోల్పోయి స్వేచ్ఛా వాయువులను ఒంటరిగానే విచారపర్వం ఆస్వాదిస్తుందని తెలిపారు. కవిత్వాంశ పెద్దగా లేకపోయినప్పటికీ కవి మునీంద్ర గారు అంశం వెలుగులో మోయలేని దు:ఖాన్ని కనురెప్పలే మోస్తాయనీ.. విచారపర్వం నుండి కన్నీటి రూపంలో మనసును బయటకు తెచ్చేవీ కనురెప్పలేనన్న అర్థం వచ్చే విధంగా తమ కవితను కొనసాగించారు. వస్తు విశ్లేషణ, పదబంధ ప్రయోగంలో మరింత ఔచిత్యాన్ని పాటించాల్సి ఉన్నప్పటికీ శిల్పం, అభివ్యక్తి విషయంలో ఇంకా శ్రద్ధ చూపాల్సి ఉన్నప్పటికీ మునీంద్ర గారు సూక్ష్మంలో మోక్షం అన్నట్లు అంశానికి తగ్గట్లు కొంతమేరకు తమ భావాలను ప్రకటించారు.

శూన్యంతో కలిసి

అత్తింటి అగచాట్లు పుట్టింట చెప్పలేక
ఎదలోపలి భారమంత ఉబికి ఉబికి వస్తుంటే
కనురెప్పలు మోయలేని
జలధారగ మారిపోయి
ప్రేమించే వారి ఎదుట
ఏడ్వలేక నవ్వలేక
వానజల్లులో తడుస్తూ
భారమంత దించుకుంటే.
కట్టుకున్నవాడు పెట్టే
కష్టాలు తాళలేక
కన్న పిల్లల ఎదుట
ఏడ్వలేక నవ్వలేక
మహానటిగా మారిపోయి
ముఖము కడిగి నెపముతోని
సబ్బు నురుగు చేతులతో
కరిగించిన కన్నీటి కంటి ధారలు ఎన్నో...
వయసు మళ్లిపోయినాక
కన్న కొడుకు కాదంటే
గొప్ప బతుకు ముసుగు నుండి
రాలేక ఉండలేక
మూసిన దుప్పటి కింద
కన్నీటి ఊట అంత ఇంకిపోయి ఎండిపోయి
తేలికైన రెప్పలతో
శూన్యంలో కలిసిపోయి..

-ఝాన్సీరెడ్డి కట్ట
9441441100

కరీంనగర్ కు చెందిన కవయిత్రి కట్ట ఝాన్సీరెడ్డి గారు రెప్పలు మోయని దు:ఖం అంశంపై శూన్యంతో కలిసి.. శీర్షికతో రాసిన కవితలో ఓ సగటు మహిళ పడే కష్టాలను.. బాధలను.. వ్యథలను..ప్రస్తావిస్తూ.. తమ భావాలకు అక్షర రూపం ఇచ్చారు. పుట్టింట చెప్పుకోలేని అత్తింటి అగచాట్లను... ఎదలోపలే భారాన్ని దాచుకుంటూ .. అంతరంగం నుండి బాధలు తరంగాలవలె ఉబికి ఉబికి వస్తుంటే.. కనురెప్పలు మోయలేని జలధారగా మారిపోతాయని పేర్కొన్నారు. ఫలితంగా ప్రేమించే వారి ఎదుట ఏడ్వలేక నవ్వలేక.. కన్నీటి జల్లుల్లో తడుస్తూ భారాన్ని అతివ దించుకుంటుందని వివరించారు.

గృహిణి కట్టుకున్న భర్త పెట్టే కష్టాలను తాళలేక.. కన్నపిల్లల ఎదుట ఏడ్వలేక.. నవ్వలేక.. వింత పరిస్థితులు ఎదుర్కొంటూ.. మహానటిగా మారిపోయి రెప్పలపై మోయని దు:ఖం ఉన్నప్పటికీ.. లోలోనే కన్నీటి ధారలను అదిమిపెట్టుకుంటుందని కొనసాగించారు. కన్నీటి చుక్కలు ఏకబిగిన హృదయంలోనుండి తన్నుకు వచ్చినప్పుడు .. తనకు తాను నియంత్రించుకుంటూ పైకి గంభీరంగా సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తుందని తెలియజెప్పారు.

గొప్ప బతుకు ముసుగునుండి రాలేక.. ఉండలేక.. మూసిన దుప్పటి కింద.. కన్నీటి ఊట అంతా ఇంకిపోయి.. ఎండిపోయి.. అంటూ రాసిన పంక్తులు కవితలో ఆర్ద్రంగా కొలువుదీరాయి. మోయలేని దు:ఖాన్ని లోలోనే భరిస్తూ ఉండ బాధామయ ఘట్టాలను ప్రస్తావించ యత్నించారు. కన్నీటిఊట అంత ఇంకిపోయి.. ఎండిపోయి.. తేలికైన రెప్పలతో కలిసిపోయే.. అంశాలను అక్షరాలలో బంధించారు.

అలతి అలతి పదాలతో..సరళత్వానికి పెద్దపీట వేస్తూ కవయిత్రి అంశాన్ని తమదైన శైలిలో విశ్లేషించే ప్రయత్నం చేశారు. ముమ్ముందు తమ కలానికి పదును పెట్టుకుని మరింత గాఢమైన కవిత్వాన్ని పండిస్తారని ఆశిద్దాం. అందుకోసం అధ్యయనంపై దృష్టి సారించాలని కోరుకుందాం.

పెళ్లి

తోడు లేని జీవితం వ్యర్థమని
అమ్మా నాన్నలు
ఏరి కోరి తెచ్చుకున్న అల్లుడు
కడదాకా తోడుంటానని
నాకు నీవు నీకు నేనని
ఎన్నో బాసలు చేస్తే
కోటి ఆశలతో మూడుముళ్లు వేయించుకుంటే
మూడునాళ్లకే ముచ్చటై
మనిషి రంగు మారిపోయి
మనసు వెలిసిపోయింది.
పుట్టింట్లో పచ్చని పందిరి ఆరనేలేదు
పెట్టిన ఖర్చు ఇంకా చూడనే లేదు
కాళ్లకు రాసిన పారాణి ఆరనేలేదు
అందంగా ఉన్నావని
చేసుకున్నా అని మొగుడంటూ
ఎంతమంది నీ వెనక పడ్డారని
ఎంత మంది మగ స్నేహితులున్నారంటూ
చరవాణి తీసి చూసి చర్చిస్తుంటే
అవమానంతో కుంగిపోయాను
ఆడదానికి ఆడదే శత్రువన్నట్లు
అత్తకూడా వంతపాడుతూ
అందమున్నదని మురిసిపడకుండా
మా చెప్పు చేతల్లోనే ఉండాలని
ఆంక్షలు విధిస్తుంటే
తోడికోడలు ఇన్నాళ్లు నేను చేసాను
ఇప్పుడంతా నీదే పని అంటూ
మోయలేని భారాన్ని మోపితే
కళ్లు వర్షించడానికి సిద్ధమవుతుంటే
కొత్తపెళ్లికూతురు ఏడుపు మొహమని వెక్కిరిస్తే
ఇంత పెద్ద చదువు చదివినా
తప్పని అత్తింటి ఆరళ్లను
గుండెలోని అంతులేని ఆవేదనను అవమానాన్ని
ఎదుపును దిగ మింగుకొని
రెప్పలు మోయలేని భారాన్ని మోస్తున్నాయి

-భీమవరపు జ్యోతి
9440051484

పెద్దపల్లికి చెందిన కవయిత్రి భీమవరపు జ్యోతి గారు రెప్పలు మోయని దు:ఖం అంశంపై పెళ్ళి శీర్షికతో రాసిన కవితలో.. పెళ్ళి చేసుకుని అత్తారింటికి వెళ్లాక వధువు పడే అత్తారింటి ఆరళ్లను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. మగువ అత్తారిట్లో . తమ అత్తా..భర్త.. తోడికోడళ్లు పెట్టే ఆఈరళ్లకు బలైపోయి.. మోయలేని దు:ఖాన్ని అనుభవించే ఘట్టాలను కవయిత్రి జ్యోతి గారు ఆర్ద్రంగా వివరించే యత్నం చేశారు.

తోడులేని జీవితం వ్యర్థమనీ.. అమ్మానాన్నలు ఏరికోరి తెచ్చుకున్నఅల్లుడు కడదాకా తోడుంటానని.. నాకు నీవు.. నీకు నేనని.. ఎన్నో బాసలు చేస్తే.. కోటి ఆశలతో మూడు ముళ్లు వేయించుకుంటే.. మూడు నాళ్ల ముచ్చటగా మారిందని వాపోయారు. మనిషి మారిపోయి.. మనసు వెలిసిపోయిందనీ పేర్కొన్నారు. ఇంకా పుట్టింట్లో పచ్చని పందిరి తీయనే లేదు.. కాళ్లకు రాసిన పారాణి ఆరనే లేదు.. అప్పుడే భర్త పెట్టే అగచాట్లకు తెలర లేచిందని వేదనను వ్యక్తపరచిరారు. అనుమానం ముసుగులో భర్త పెట్టే బాధలను ఆడదానికి ఆడదే శత్రువు అన్న చందంలా .. అత్త కూడా వంతపాడే సన్నివేశాలను కవయిత్రి జ్యోతిగారు తమ కవితలో దృశ్యమానం చేశారు. అందమున్నదని మురిసి పడకుండా మా చెప్పుచేతల్లోనే ఉండాలనే అత్తల ఆంక్షలను ఏకరువు పెట్టారు. తోడి కోడళ్లు.. నేను ఇన్నాళ్లు చేశామనీ.. ఇప్పుడంతా నీవే పనంతా చేయాలని వేధించే అత్తల మనస్తత్వాలకు అద్దం పట్టారు. మోయలేని భారాన్ని మోస్తూ.. కళ్లవెంట కన్నీటి ధారలు వర్షించడానికి సిద్ధమవుతుంటే.. అంటూ కొనసాగించిన పంక్తులు కవితకు పుష్టినిచ్చాయి. ఎంత పెద్ద చదువు చదివినా.. ఎంత అందంగా ఉన్నప్పటికీ..కట్నమెంతో యిచ్చుకున్నప్పటికీ. ఏం లాభం? అతివ అత్తారింటి ఆరళ్లను.. అవమానాలను గుండెలోనే దిగమింగుకుని..రెప్పలు మోయలేని భారాన్ని మోస్తున్నాయని ముగింపునిచ్చారు.

వస్తువిశ్లేషణలో అభివ్యక్తిలో శిల్పం విషయంలో పదబంధ ప్రయోగం విషయంలో కవయిత్రి యింకా పరిణితి సాధించాల్సి ఉంది. పెళ్లయ్యాక ఓ మహిళ కష్టాలను కాస్తంతైనా ప్రకటించడానికి ప్రయత్నించారు. ముమ్ముందు అధ్యయనంపై దృష్టి సారించి మరింత గాఢమైన కవిత్వాన్ని ప్రకటిస్తారన్న నమ్మకం ఉంది.

చీకటి తరువాత

చటుక్కున మెరుపులా మాయమైన వెలుతురు
వెన్నెంటే జోగుతున్న రోమాలను కొసలట్టుకు లాగుతూ
కొలతలకందని మేఘాల ఆక్రందన
రెప్పలార్చి తెరిచిన సమయంలోనే
దట్టమైన మంచు వానలా కురిసిన శబ్దరాహిత్యం.
చీకటి పాకి పాకి నింగీ నేలా
నాలుగు చెరుగులూ అలుముకున్నాక
స్పృహ కోల్పోయి సాగిల పడిన
వీధి దీపాలు కంటి వెలుగైనా సారించలేక
ఒత్తిగిలిన క్షణాన
ఉన్నట్టుండి ఏ సింధూ లోయలోనే
అనాది యుగాల మధ్య ఆదిమ జాతిలా మిగిలిపోయాక
ఆకారం రంగూ రూపూ కోల్పోయిన ఆధునికత
దిక్కుతోచని అయోమయం లో
మెదడు మరణించిన పిపీలికం అయిపోయాక.
ఎప్పుడు నిద్ర నాచు లోకి జారిందో మానవజాతి
సుదీర్ఘ స్వప్నాంతర పయనం ముగిసి
తెప్పరిల్లిన సంధి వేళ
ఎటు చూసినా రెక్కలు రాలిన మిణుగురు పురుగులే
కొన ఊపిరి అంచుల మీద ఓక ఆశ చిరు కదలిక
గోరంత వెలుగు రేపటి మహాసముద్రం
నడి మధ్యన ఒక చిటికెడు
వేడిని రగిలిస్తూ
మొహం ఎరుపెక్కిన భవిత.

-స్వాతీ శ్రీపాద
8297248988

నానీలు

మట్టికి ప్రాణం పోసిన
కుమ్మరి
కాలచక్రంలో
దేశ దిమ్మరి.

కాలం
ఆడుకునే బంతి కాదు
వసరగానే
వెనక్కి తిరిగి రావడానికిఏ

-వడ్డేపల్లి సంధ్య
సెల్:7036000123

నానోలు

పుస్తకం
దిక్సూచి
చదువు
గమ్యం

నవ్వు
సుగంధం
కోపం
దుర్గంధం.

విజ్ఞత
విజయం
అహం
పరాజయం

కలం
కూర్పు
కవిత్వం
మార్పు

వెన్నెల
వెండి
వెలుతురు
స్వర్ణం

మెరుపు
పలకరింపు
చినుకు
పులకరింపు

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

కవులు, రచయితలు ప్రజల్లో చైతన్యం తేవాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డా॥ నందిని సిధారెడ్డి



హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జయశంకర్ స్మారక కవితా సంకలనంని ఆవిష్కరిస్తున్న డాక్టర్ నందిని సిధారెడ్డి, యుగేందర్ గౌడ్, బడేసాబ్, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, బైస దేవదాసు, డా॥నాళేశ్వరం శంకరం, తదితరులు.

కవులు, రచయితలు నిరంతరం మాట్లాడుతూ సాదించుకున్న తెలంగాణలో మిగిలిన సమస్యల పరిష్కారానికి తమ కవితలు, రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనీ, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ కన్న కల తెలంగాణ రాష్ట్ర సాధనతో నెరవేరిందన్నారు. మిగిలిన కలలు సాకారం కావాలంటే ఇప్పుడున్న ప్రభుత్వం చేయకపోతే రానున్న రోజుల్లో ఏర్పడే ప్రభుత్వం ద్వారా నెరవేరవచ్చన్నారు.

అందుకోసం కవులు రాస్తుండాలని, భావజాలాన్ని వ్యాప్తి చేస్తుండాలని, ప్రజలకు ఉద్యమాలవైపు మలుస్తుండాలని అన్నారు. అన్నం పెట్టాలన్నా, నిలబెట్టాలన్నా ప్రజా ఉద్యమాలు అవసరమని, అందుకోసం కవులు కళాకారులు రాస్తూ, మాట్లాడుతూ ఉండాలని అన్నారు. ఆదివారం ఇందిరాపార్కు, చౌరస్తాలోని హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో తెలుగు భాషా చైతన్య సమితి, లక్ష్యసాధన ఫౌండేషన్, తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ యువజన జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ సిద్దాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ స్మారక కవితా సంకలనం ఆవిష్కరణ సభ, కవి సమ్మేళనం నిర్వహించారు.

సభాధ్యక్షులుగా తెలుగుభాష చైతన్య సమితి ఫౌండర్ బడేసాబ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నందిని సిధారెడ్డి, మేధ్చల్ అడిషనల్ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచాల యుగేందర్‌గౌడ్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, తెలుగుభాష చైతన్య సమితి ముఖ్య సలహాదారులు ఆళ్ల రామకృష్ణ, ఓయూ జేఏసీ టీఎస్ జేఏసీ ఛైర్మన్ అశోక్‌యాదవ్, లక్ష్య సాధన ఫౌండేషన్ ఛైర్మన్ ప్రజ్ఞరాజు, తెలంగాణ హైకోర్టు న్యాయవాది కొంకల జంగయ్య, ఏపీజే సత్యంసాగర్, అవమల్లయ్య, కేవీ జనార్ధన్:, మనోహర్‌రెడ్డి హాజరై, ప్రొఫెసర్ జయశంకర్ స్మారక కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రావడం అనేది గొప్ప చరిత్ర అన్నారు. వచ్చిన తెలంగాణలో ఎప్పుడైనా తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే పాలించుకుంటారని పేర్కొన్నారు. తెచ్చుకున్న తెలంగాణలో పరిష్కరించుకోవాల్సిన సమస్యలు ఉన్నాయని, సరైన పాలకులు ఉంటే నిరుద్యోగ సమస్యను పరిష్కరించుకోవచ్చని అన్నారు. ప్రజలను ప్రేమించే పాలకులు పరిపాలిస్తే సత్వరమే న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాదన కోసం ప్రొఫెసర్ జయశంకర్ 1969 నుంచి మలిదశ ఉద్యమం వరకు కీలక పాత్ర పోషించారని, తెలంగాణ రాష్ట్రం అన్యాయానికి ఎలా గురవుతుందో, ఎందుకు తెలంగాణ రాష్ట్రం కావాలో అనే విషయాలపై అనేక పుస్తకాలను రాసి ప్రజల్లో తెలంగాణ పట్ల చైతన్యం కలిగించిన సిద్దాంతకర్త జయశంకర్ అని కొనియాడారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ, నేటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవశ్యకత, జరిగిన అన్యాయాన్ని క్షుణ్ణంగా వివరించిన గొప్ప వ్యక్తి జయశంకర్ అన్నారు. జయశంకర్ గురించి మాట్లాడటం అంటే మిగిలిపోయిన లక్ష్యాలను సాధించుకోవడమే అన్నారు.

పుస్తక సమీక్ష

తెలంగాణ నవలా మాగాణం

తెలుగు సాహిత్యపు "నవల" ప్రక్రియ పాశ్చాత్యుల నుండి తేబడినది. నాటి ప్రబంధ కావ్యములే నేటి 'నవల'కు తల్లివేరు అని చెప్పవచ్చును. పద్యము తప్ప మరియే రచనయైనను ఊహించజాలని కాలము నుండి మన సాహిత్యకారులు నెమ్మది నెమ్మదిగా వచన రచనలకు శ్రీకారము చుట్టినారు. కాలాను గుణంగా సాహిత్యం కూడా రూపాంతరం చెందుతూ, ప్రజాభీష్టానికి అనుకూలమైన మార్పులు సంతరించుకుంటున్నది.

అవిభక్త ఆంధ్ర రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతపు తెలుగు "సవతి చూపు'కు గురి అయింది. ఈ ప్రాంతపు భాష తెలుగే కాదు(అన్నంతటి తీవ్ర వివక్షకు గురి కాబడింది.

వేరు తెలంగాణ ఆవిర్భావం తరువాత. తెలంగాణ ప్రాంత సంస్కృతి సాహిత్యములపై స్పృహ/ ఆకాంక్ష ప్రజలలో వెళ్ళూనుకున్నది. రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంస్కృతి పరిరక్షణలో భాగంగా తెలంగాణ సాహిత్య అకాడమీ నేర్పరచి, ఈ ప్రాంతపు తెలుగు వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయుటకు సంకల్పించినారు.

స్వతః సాహితీవేత్త, నిపుణులు చిత్తశుద్ధిగల శ్రీ నందిని సిధారెడ్డి అధ్యక్షతన అకాడమీ నడుం బిగించింది. క్రీ.శ.61 నుండి ఈ ప్రాంతంలో దొరికిన ఆధారాల ప్రకారం హాలుడు సంకలనం చేసిన 'గాథాసప్తశతి'లో కనబడిన అత్త, పిల్ల, పత్తివంటి పదాలను గమనించింది. క్రీ.పూ.300 గోపరాజు కాలం నుండే తెలుగు మాట వాడుకలో ఉన్నట్లు గమనించింది. క్రీ.శ.947 నాటి కుర్యాల ప్రాంతపు శాసనాలలోని కంద పద్యాలను పరిశీలించింది. నాటి తెలుగు సాహిత్య ప్రాభవాన్ని నేటి తరానికి అందించటానికి కంకణం కట్టుకున్నది. ప్రప్రథమ తెలుగు ప్రపంచ మహాసభ (15 డిసెంబర్ 2017 నుంచి 19 డిసెంబర్ 2017 వరకు) నిర్వహించింది. ఆ సందర్భాన తెలంగాణ ప్రాంత సంస్కృతి సౌరభాలను వెదజల్లే 15 పుస్తకాలను ప్రచురించింది. ఇది అకాడమీ వారి 5 ప్రచురణ. స్థానిక పరిస్థితులు, నవలా రచన, తొలి నవల నవలా క్రమ పరిణామం, సుప్రసిద్ధ నవలాకారులు, నవలల్లో ప్రతిబింబించిన జీవితం, నాడు పరిఢవిల్లిన సంస్కృతి-లాంటి పలు కోణాల్లోంచి చేసిన విశ్లేషణ ఇది.



తెలంగాణ ప్రాంతపు నవలపై ప్రతాపరెడ్డివంటి ముందు పలు వ్యాసాలు పత్ర సమర్పణలు కొందరు రచయితలు 'విషయ స్పర్శ' గావించినారు. రచయిత వాటినన్నింటిని తన ఎరికలోకి తీసుకున్నారు. పేజి 94లో ఇచ్చిన ఆధార గ్రంథాలను పరిశీలిస్తే రచయిత అతి లోతైన చూపుతో 'తెలంగాణ నవలా వికాసం' గ్రంథాన్ని రూపొందించినట్లు తెలుస్తున్నది.

ముదిగంటి సుజాతారెడ్డిగారి ముందు మాట- 'తెలంగాణ నవల వైశాల్యం వైవిధ్యం'లో అన్నట్టు రచయిత ఈ 95 పేజీల గ్రంథంలో తెలంగాణ నవలపై విహంగ వీక్షణం గావించారు. 9 అధ్యాయాల్లో మొదటి మూడు అధ్యాయాల్లో తెలుగులో తొలి నవల కందుకూరి వీరేశలింగంగారి రాజశేఖరచరిత్ర (1878)తో మొదలుపెట్టారు. అంతకు మునుపే- అంటే 1866లోనే తెలంగాణ వచన ప్రబంధంగా ప్రసిద్ధికెక్కిన 'కంబు కంధర చరిత్ర' తడక మల్ల కృష్ణారావుచే వ్రాయబడిందన్నారు. అదే రచయిత 1879లో వ్రాసిన 'తెలుగు వెలుగు ముగుద కథ' రెండవ నవలగా పేర్కొన్నారు. గమనించదగ్గ విషయం ఏమంటే- తెలంగాణ ప్రాంతంలో నవలా ప్రక్రియ ఇంచుమించు కందుకూరి వీరేశలింగంగారి రాజశేఖర చరిత్రకు సమాంతరంగా మొదలయింది. సోమరాజు రామారావు మంజుమతి (1914)ని ప్రస్థావిస్తూ, ఒద్దిరాజు సోదరులలో ఒకరైన ఒద్దిరాజు సీతారామ చంద్రరావుగారి రుద్రమదేవి (1918) ఆ తర్వాత వచ్చిన నవలగా చెప్పబడింది.

అధ్యాయం 4లో సాయుధ పోరాట కాలం (1948 ముందు)లో వచ్చిన నవలలను ప్రస్థావించారు. వట్టికోట ఆళ్వారుస్వామి, మాడపాటి హనుమంతరావు, హీరాలాల్ మోరియా, భాస్కరభట్ల, దాశరథుల రచనలు పేర్కొనబడ్డాయి. అధ్యాయం 5లో సాయుధ పోరాటం తర్వాత రచయితలు అంటే- చెరబండ రాజు, అల్లం రాజయ్య, బి.యస్.రాములు ప్రభృతుల రచనల వివరాలు ఇవ్వబడ్డాయి. 67 మరియు 8 అధ్యాయాల్లో పలువురు సమకాలిక రచయితలు, రచనలు పేర్కొన బడ్డాయి, నవలాకారుల దృక్పథం, పరిధి విస్తరించినట్లుగా నిర్ణయించారు. పలు వాదాల నాధారం చేసుకుని నవలలు వెలుగు చూసినట్లుగా చెప్పారు.

9వ అధ్యాయంలో రచయిత అంపశయ్య నవీన్ రచనలు విశేషంగా వివరించబడ్డాయి. నందిగం కృష్ణారావు, పరవస్తు లోకేశ్వర్ లాంటి వారల నవలలోని ప్రత్యేకతలను వివరించారు.

తెలంగాణ నవల ఇటీవలే ప్రారంభం కాలేదు. తెలుగు నవల ఆవిర్భావానికి తెలంగాణ నవలలో కూడా బీజాలున్నాయి. ప్రజల నుంచి దూరం కాని తెలంగాణనవల తన ప్రత్యేకతల నిలబెట్టుకుంటూ వస్తున్నది. మధ్యతరగతికి సంబంధించిన నవలలు ఇంకా రావాలి. ఇప్పుడు రచయితలుగా కవులుగా మేధావులుగా ఎదిగిన తెలంగాణావారు తమ తమ 'ఆత్మకథలు నవలా రూపంగా వస్తే, ఈ ప్రాంతపు సాంస్కృతిక చరిత్ర మనముందుంటుంది. ఇది నేటి తెలంగాణ అస్తిత్వ పోరాటానికి అవసరం కూడా అని అంటారు.

ఇటువంటి విలువైన, అమూల్యమైన రచనలకు ప్రోత్సాహమిస్తూ, ప్రకటిస్తోన్న తెలంగాణ సాహిత్య అకాడమీ వారు అభినందనీయులు.

ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభవన్, రవీంద్రభారతి,
సైఫాబాద్, హైదరాబాద్-500 004.



- కూర చిదంబరం
సెల్: 8639335675

భల్లం భాష్యం

కన్నుమూత పడేదాకా కవిత్వం రాయాల్సిందే..!!

అందరూ కవులే కదా.. అని అనుకుంటాం, గానీ అందులోనూ అనేకానేక కవులు, రకరకాలుగా వేరు వేరు. సూక్ష్మాతి సూక్ష్మంగా విశ్లేషించి చూస్తే సామాజిక అభివృద్ధి కాంక్ష గలిగిన కవుల, కవితా ప్రక్రియ విధి విధానాలు వేరు. ఏ దృక్పథంతో రాసిన వాళ్ళయినా సామాజికాభివృద్ధిలో తమ వాటా తాము పొందగలిగిన వాళ్లే నిజమైన కవులుగా ఎదుగుతారన్న విషయం స్పష్టమవుతుంది. వస్తు భావనలోనే ఆ కవి స్వీకరించే వర్గ దృక్పథం కవిత్వంలో అంతర్భాగమయి ఉంటుంది. ఏదో ఒక చోట కవిత్వంలో పీడితుణ్ని గూర్చి వర్ణించడమే కాకుండా, ప్రజా చైతన్య పూరిత సన్నివేశాన్ని రూపు కట్టించడంలో కవి వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది.

కొందరు గొప్ప అసంతృప్తి కవులు ఉంటారు. అసంతృప్తిలోంచే జీవిత వాస్తవాలు వెలికి తీస్తుంటారు. పై పెచ్చు జీవితంలోని అన్ని వర్గాలనూ తన పరిధిమేరకు కవిత్వంలో స్పృశించడం వల్ల- ఈ విధమైన అసంతృప్తి అంశం పలు కోణాల్లో ఆవిష్కృతం అవుతుంది. అందువల్లనే ఈ కవుల కవిత్వం మన చుట్టూ తిరుగుతున్నట్టూ అనిపించినా మనకు తెలియని కొత్త కోణం ప్రతీ కవితలో కనిపిస్తుంది. సరిగ్గా ఈ కారణం చేతనే ఆ కవులు ఎప్పటికప్పుడు కొత్తగా కాస్తంత వింతగా కనిపించడం కద్దు. కవిత్వాభివ్యక్తి విషయంలో కొత్త కొత్త పదబంధాలు, భావ చిత్రాలు, ప్రతీకలు, అలంకారాలు ప్రయోగించడం పాతభావాలను, శబ్దాలను కొత్త అర్థంలో ప్రయోగించడం- భాషను స్వేచ్ఛగా ఉపయోగించబడు తుంది.

కవిత్వ రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ అత్యంత గౌరవ ప్రదమైన కవి పదవి వరకూ రావడమే కాదు. తన కవిత్వంలో సమాజంలో నవ చైతన్యాన్ని నింపుతూ, ఇక అంతటితో తన కవిత్వపు ఎదుగుదల అయిపోయిందని సరిపెట్టుకోకుండా, కవులు తలచుకుంటే సాధించలేనిదంటూ ఏమీ లేదనే స్ఫూర్తి సమాజంలో నింపాలన్న తపన, పట్టుదల ప్రతిభ కవికి నిండుగా, దండిగా, మెండుగా ఉండాలి. అంతేకాదు- పుస్తకాలలోనే కాదు- ప్రజల మస్తకాలోల కూడా మార్పు తీసుకురావాలన్న సంకల్ప బలం ఎంతో ముఖ్యమైంది.

కవిత్వమంటే- జీవితానికి సంబంధించిన అన్ని విషయాల ఖాళీలను సమున్నత భావ చిత్రాలతో నింపడం, జ్ఞాపకాలు, ఊహలు, ఆలోచనలు, కోరికలు, అంచనాలు ఆవిష్కారాలు, మూడ్స్ వీటన్నింటినించీ మనకు మనం తెలియకుండా బయట పడడమే. బాహ్య విషయాలన్నింటినించీ మనసు బయట పడడం అప్పుడు అక్కడ స్వచ్ఛమైన శూన్యం ఏర్పడడం. ఆ శూన్యంలో మాత్రమే మనల్ని మనం కవిత్వంగా చూసుకోవడం. ఆ స్వచ్ఛమైన చైతన్యంలో స్నానించడమే కవి జన్మకు గొప్ప అనుభవం.

కవిత్వ రచన వెనుక కనీసం కొన్ని దశాబ్దాల సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, వారసత్వాల బరువువుంది. దీనికి తోడు ఆర్థిక సంక్షోభం నుంచి పుట్టిన విషాద నేపథ్యం ఉంది. ఆదర్శాల, ఐడియాలజీల నిర్బంధాలు ఉన్నవి. ఇత్యాది వల్ల శైలి, శిల్పం, భాష క్రుంగిపోతున్నాయేమో. ఈ లోపం వస్తువును కుంచింపచేస్తుందేమో. వైవిధ్యం లోపించిన వస్తువు, అరిగిపోయిన శైలికి కవి ఎంత దూరంగా వుంటే అంత మంచిది.

> తన కవిత్వంలో సమాజంలో నవ చైతన్యాన్ని నింపుతూ, ఇక అంతటితో తన కవిత్వపు ఎదుగుదల అయ

అలతి పదాల్లో అనంత అర్థాలను చెప్పే "స్నిగ్ధకుసుమం"

పుస్తక సమీక్ష

స్వల్ప వాక్యాలలో అనంత భావాల్ని తెలిపే ప్రక్రియలు మనకి అనాది నుంచి వస్తున్నవే ..పురాణం ప్రబంధాలలో ద్విపదల ప్రస్థానం చూడొచ్చు అసలు ద్విపద లు అంటే ఏమిటి? పద్యమా, గద్యమా లేక మాత్ర ఛందస్సా .క్లుప్తం గా చెప్పుకుంటే రెండు లైన్లలో భావాన్ని చెప్పే చిరు ప్రక్రియ. ద్విపద లక్షణాలు చూస్తే వీటి లో .11 నుండి 15 అక్షరములు ఉండును, రెండు పాదములు ఉండును. ప్రాస నియమం కలదు ప్రతి పాదమునందు 3 వ గణము యొక్క మొదటి అక్షరము యతి స్థానము. ప్రతి పాదమునందు మూడు ఇంద్ర , ఒక సూర్య గణములుండును. ఇలా కొన్ని లక్షణాలతో కూడిన ద్విపదల్ని ఎంతో చక్కగా రాసి పుస్తక రూపంలోకి తెచ్చి మన ముందు ఉంచారు సిరి వడ్డే గారు .. తన "స్నిగ్ధ కుసుమం" లో అన్ని ద్విపదాలు మనసుకు హత్తుకుంటాయి ...అన్ని భావాలని మందారమాలగా చేకూర్చి పాఠకులకి అందించారు. ఈ ద్విపదాల్లో భావుకత, మనసు పడే వేదన, ప్రేమ రాహిత్యము, ప్రేమ లాలిత్యం, భావుకతనే కాకుండా చాలా ద్విపదాల్లో సామాజిక స్పృహ కూడా ఉండటం గొప్ప విశేషం ...సాధారణంగా భావకవితాల వైపు మొగ్గు చూపుతారు కానీ సిరిగారు అటు భావుకతని సామాజిక అంశాల్ని పరిగణలోకి తీసుకోవడం సమాజం పట్ల బాధ్యతని తెలియచేస్తుంది ..అలాగే మనిషి లోని భావోద్వేగాల్ని కూడా చక్కగా చెప్పారు ...మనిషి తన కోసం, తన అవసరం కోసం ఏదైనా చేస్తాడు ఎంతకైనా తెగిస్తాడు ఇదిగో .

"అవసరానిదెంత స్వార్థమే
అనుబంధాల్ని సైతం తాకట్టు పెడుతూ" ఈ రోజుల్లో అనుబంధాలు అన్ని డబ్బు చుట్టూనే తిరుగుతున్నాయి ...పిండి కొద్ది రొట్టె అన్నట్టు డబ్బు కొద్దీ సంబంధం...ఎంత దారుణం.

మనసు కు నచ్చినవాళ్ళని గెలుచుకోవడానికి కొన్ని సార్లు మాటలు అవసరం లేదు మౌనం తో కూడా గెలవొచ్చు అందుకే మాట ని మౌనాన్నే ఆశ్రయిస్తారు కాబోలు ..

"మౌనాన్ని ఆశ్రయించక తప్పదు
నీ హృదయాన్ని కరిగించుకునే ప్రయత్నంలో "
మనసుకి నచ్చిన వాళ్ళ ఎదుట వేళా మాటలు చెప్పక మౌనం తో నే హృదయాన్ని కొల్లగొట్టవచ్చు ...

అనుకోకుండా తారసపడి ప్రేమించినప్పుడు, ఆమె కి హృదయం లో స్థానము ఇచ్చినప్పుడు కలగా నే మిగిలిపోతుంది, ఇక అలాంటి కళలు ఎప్పటికి తీరవు ఏమో అందుకే కల ను తలుచుకోవడానికి బాగానే ఉన్న కూడా అవి తీర్చుకోడమే భారం గా తోస్తుంది కింది రెండు ద్విపదాల్లో కల ని ఉద్దేశించి ..ఇదే విషయాన్ని చెప్తారు .

"కల గానే మిగిలిపోయావట
హృదయం లో స్థానం దొరకబుచ్చుకోగానే"
"కలలెప్పటికీ మురిపించేవే

సాకారమేగా భారమనిపించేది ..." నిజమే కల నిజం కావాలంటే కృషి పట్టుదల ఉండాలి ...

మన దేశం లో అక్రమాలని అన్యాయాల్ని సులువుగా చేసే మహానుభావులు ఎందరో, ఈ దేశంలో చట్టాలు ఉన్నా నిరుపయోగమే అనే భావనకి సగటు పౌరుడు వచ్చాడంటే న్యాయం ఎంతలా అమలు అవుతుందో కదా...

"అదుగో అక్రమార్క చక్రవర్తి
పట్టువదలక అక్రమాలకు కొమ్ము కాస్తూ"అంతే ప్రతి ఒక్కరు దేశాన్ని దోచుకుంటూ అక్రమార్కులకు అన్యాయం చేసేవారికి అందండధలు ఇవ్వడమే..

"Face is the index of the mind" అన్నారు ..అంటే మనిషి ముఖం చూసి మనసులో ఏముందో తెలుసుకోవచ్చు అని ..కానీ అది అన్ని వేళల పని చెయ్యదు కాబోలు ..కొంతమంది అందం ఉన్న కూడా మనిషిలా నడుచుకొను కురూపిగా ఉన్న ఎంతో మంచిగా సంస్కారంతో మెలుగుతారు. ఇప్పుడు దేనికి ఉండాలి ...మనిషికా, మనసుకా..?

**"అందం ఉండాల్సింది
మనిషికి కాదు,...మాటకు, మనస్సుకు"!!** అంవును మనిషి బాగుంటే చాలదు మనిషి మాట, మనస్సు రెండు బాగుంటునే అందరికి ఇష్టమైనవారు అవుతారు ..

అనుకోకుండా జరిగే కొన్ని పరిచయాలు మనల్ని వేరే లోకం లోకి తీసుకువెళ్తాయి ...స్నేహంతో మొదలై ప్రేమతో ముగుస్తాయి ..అలా అని అన్ని స్నేహాలు ప్రేమగా మారి వారించవు కొన్ని మాత్రమే అలా ఉంటాయి ఏమో ....ఇదిగో ఇలా

**"అరుదైన వరం నీ పరిచయం
అపూర్వమే నన్ను మాత్రమే వరించిచడం"**

పరిచయం కలగడమే అద్భుతం అనుకుంటే ఏరి కోరి వరించడం ఇంకెంత ఆనందకర విషయము కదా.....

నేడు స్త్రీలకి రక్షణ లేకుండా పోతుంది. అనుక్షణం భయం నీడలో బతకాల్సి వస్తుంది. ఎక్కడ పడితే అక్కడ అభివన కీచకులు ఉన్నారు ...మానభంగాలని విరివిగా చేస్తూ భయపెడుతున్నారు అని ఆవేదనతో రాస్తూనే దానికి పరిక్షర మార్గం కూడా చూపారు ...నాలుగు పాదాల్లో ..

**"ఎక్కడ పడితే అక్కడ వేళల్లో ఉన్నారు
మానభంగాలు చేసేముందు కీచకుని పూజించే కామాంధులు"**

**"నిత్యం దీపావళీ
కలియుగ నరకాసురుల వదను మెదుమేధాలు పెడితే"**

మొదటి పంక్తులలో సమస్య ఉంటె రెండవదాంట్లో పరిష్కారం కనిపిస్తుంది ..చాలా మందికి ఆ పరిస్కారం నచ్చకపోవచ్చు కానీ ఇప్పటి కాలం లో స్త్రీల పట్ల జరుగుతున్నా దారుణాల్ని చూస్తే సబబే అనిపిస్తుంది.

ఆరుగాలం కష్టం చేసే రైతు ఈరోజు బతకడానికి యుద్ధం చేస్తున్నాడు ...తానూ యజమాని అయినా కూడా అప్పులతో, ప్రభుత్వాలతో ఇంకా జీవితంతో బానిసత్వాన్ని అనుభవిస్తున్నాడు వాటిని మరణం అనే ఒకే ఒక్క వేటుతో తెగకొస్తాడు, జీవితపు బానిసత్వం నుంచి బయటపడతాడు ..

**"రైతెప్పటికీ రాజే
మరణం తో జయిస్తాడుగా బానిస బ్రతుకును"** రైతు తన బతుకు ను బానిసత్వం గా భావిస్తున్నాడు అంటే ఆ తప్పు అందరిదీ..

మనిషి ఎంతగా ఎదిగితేనేమి వినయ సంపద లేకుండా ఆకాశాన మార్గాన తచ్చాడుతుంటే మనిషి ఎంత గొప్పవాడైన మామూలువాడితో సమానమే..

**"పేరు ముందెన్ని బిరుదులుంటేనేమిలే
మనసంతా బురదనే నింపుకున్నాక"** నిజమే మనసు స్వచ్ఛం గా లేనప్పుడు మనిషి ఎంత బాగా ఉంటె లాభమేమి ..

ఎలాగూ మనిషి గురించి చెప్తున్నప్పుడు అతని జీవితం గురించి కూడా చెప్పుకోవాలి ..మనిషి జీవితం తృణప్రాయమే ...ఉన్నన్ని రోజులు ఉండి వెళ్లిపోవడమే... అందుకే జీవితాన్ని నాటకంతో పోలుస్తారు కాబోలు

**"జీవితం ఒక వీధి నాటకమే
చావు తెర పడేవరకు"** నిజమే మరి తెర ఉన్నంతవరకు మాత్రమే మనం అనుభవించేది దించేసాక వెళ్లిపోవడమే...మరి అలాంటి జీవితంలో కొన్ని విజయాలు సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కితే ...అవి కేవలం అతనికి మాత్రమే తెలిసి మిగతావారికి తెలియకపోతే తెలియజేయాల్సిందే ..

**"తెరవని పేజీలెన్నో
నా జీవన్నాటక "ప్రతి"లో చరిత్రలై మిగిలిపోతూ"**

అందరి జీవితమూ తెరిచినా పుస్తకము కాదు ..కొన్ని తెలియని పుటలు కూడా ఉంటాయి ..

ఇక ఈ ప్రపంచంలో మనం నిజాయితీగా ఉంటె సరిపోదు అందరు నిజాయితీగా ఉంటేనే అవినీతి లేని రాజ్యంలో సురక్షితంగా ఆనందంగా జీవించగలుగుతాము ..కానీ అవినీతే పరమావధిగా జీవిస్తున్న మన దేశం లో అవినీతి పరులే సంపన్నులు ..నిజాయితీ కలిగి ఉన్నవారు పేదవారే ..ఎప్పటికి

**"నిజాయితీ నిరుపేదనే
అవినీతిపరుల రాజ్యంలో"** వంద శాతం నిజం ఇది ..ఇప్పుడు ఉన్న కాలమాన పరిస్థితుల్లో నిజాయితీగా ఉన్న, దాని గురించి మాట్లాడిన వింత జంతువు ని చూసినట్టు చూస్తున్నారు ...మారాలి ఇది .

మనసులు కలిసిన్నపుడు ప్రేమగా మారుతుంది ఆ ప్రేమ పెళ్లి దాకా వెళ్లాలంటే కొన్ని అడ్డంకులు ఉంటాయి. అవన్నీ దాటుకొని ముందుకు వెళ్తేనే పెళ్లి ...భౌతికం గా పెళ్లి కావాలనుకుంటే పెద్దలని ఒప్పించి మెప్పించి పెళ్లి చేసుకోవాలి కానీ మనసులతో పెళ్లి కుదరదని ఎంత సమయంలో కదా

**"ఇంకా ఎన్నాళ్ళో
మన మనసులతో నే మంగళ్యాన్ని ముడేసుకోవడం"**

ఎదురు చూపులో ఎంత వేదన ఉంటుందో అంత మధురం కూడా ఉంటుంది ..మరి

"అమ్మ" గొప్పతనం ఎంత వివరించిన తక్కువే అలాంటి అమ్మ తానూ చనిపోతాను అని తెలిసినా కూడా మనకి జన్మ నిస్తూ మరో జన్మని ఎత్తుతుంది ..ప్రతి బిడ్డని భూమి మీదకి తీసుకురావడం అంటే అమ్మకి జీవన్మరణ సమస్యనే...మరి అలాంటి అమ్మకి వందనాలు

**"పునర్జన్మ ఎత్తుతూనే ఉంటుంది అమ్మ
ప్రతి కానుపులోనూ తిరిగి జన్మిస్తూ"** నిజం కాన్పు అయ్యేదాకా చావు బతుకు ల మధ్య కొట్టుకులాడుతూనే ఉంటుంది అమ్మ ప్రాణం ...

ఇప్పటి యువత అంతా వ్యసనాల బాట పట్టి అమూల్యమైన జీవితాన్ని, కాలాన్ని వృధా చేసుకుంటున్నారు వారంతా సవ్యంగా ఉంటె మంచిగా స్థిరపడతారు కదా...రచయిత్రి గారు నేటి యువత పోకడల్ని చూసి ఆవేదన చెందుతారు ..

**"యువత నలుగుతుంది
మాదక ద్రవ్యాల కౌగిలిలో"** మాదక ద్రవ్యాలని ఒకసారి అలవాటు చేసుకుంటే ఇక చచ్చే దాకా వదలదు ఈ వాస్తవాన్ని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది ...

ప్రేయసి తలపులు చాలా అద్భుతంగా ఉంటాయి తలపు మాత్రమే ఇంత తీయగా ఉంటే ఇద్దరు కలిసి ఊసులాడితే ఇంకెంత గొప్పగా ఉంటుందో కదా...అయినా ఇంకెన్నాళ్లు ఇలా అని ఒక సగటు ప్రేమికుడి భావన చూడండి ..

**"ఇంకా ఎన్నాళ్ళో
తలపులతోనే సర్దుకుపోవడం"** ఇక అభినవజనులు ... నుంచి విముక్తి పొంది త్వరగా వారి ప్రేమకి దగ్గరవాలని కోరుకుందాం ..

ప్రపంచం గొప్పగా వెలిగిపోతుంది అని గొప్పలు చెప్పుకొని మురిసిపోతాము కానీ ప్రపంచం లో సగం మంది పేదలే ...కొందరు అన్నం కరువై మరికొందరు బట్టలు కరువై ...

**"ప్రపంచంలో సగంమంది పేదలే..
కూటికి కరువై కొందరు, బట్ట కరువై మరికొందరు"**

అవును ఇప్పటికి ఈ ప్రపంచంలో ఓ పూట అన్నం, ఓ గుడ్డముక్క లేక ఎంతమంది అల్లాడుతున్నారో ...

ఇలా భావుకత, ప్రేమతత్వం, విరహం, తాత్వికత, సామాజిక స్పృహ, మనిషితనం, స్త్రీల పట్ల సహానుభూతి ఎన్నో ఈ "స్నిగ్ధ కుసుమం"లో ఉన్నాయి ....ద్విపదాల్లో చాలామటుకు భావ కవిత్వం ప్రాధాన్యత ఉంటాయి. కానీ ఈ కవితా పుస్తకంలో అన్ని రకాల అంశాలని స్పృశిస్తూ ముందుకు సాగడం బాగుంది ...దాటాపు మూడు వేల ద్విపదల్ని రాయడం, రాసినవాణ్ణి ఓ చోట కూర్చి పుస్తకంగా మలచడం అంత సులువేమీ కాదు ....చాలామందిలా కేవలం భావ కవిత్వాన్ని మాత్రమే ఆలంబనగా చేసుకోకుండా సామాజిక అంశాలని సైతం ద్విపదలో ప్రస్తుతించడం గమనించతగిన విషయము .దీని ద్వారా తనకి సామాజిక బాధ్యత ఉన్నదని తెలియచేశారు. ద్విపదల నుంచి వచన కవిత్వం వైపు మెల్లగా అయినా బలంగా అడుగులు వేస్తున్నారు ...ఆ విషయములో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుందాం. మంచి పుస్తకాన్ని మనకి అందించిన సిరి గారికి, బుక్ పబ్లిష్ చేసిన జె వి ..పబ్లికేషన్ వారికి

ప్రతులకు: సిరి వడ్డే
17, ఈవన్స్ వే
సాస్టన్, కాంబ్రిడ్జ్
సిబి22 3బిఎక్స్
యునైటెడ్ కింగ్‌డమ్.

-పుష్యమీ సాగర్
9010350317

వ్యూహ సమయం

సంధి కాలమంటే
సందెవేళలాంటిదే
వెలుతురు లేదన్న
బాధా లేదు
చీకటి కాలేదన్న
సంతోషం లేదు.

గతానికి
భవిష్యత్తుకు
వర్తమాన వారధి
దుర్ముహూర్తం నుండి
సుముహూర్తం లోకి
మోసుకెళ్ళే పల్లకీ.

అద్భుతమైన యుగాల నుండి
అపురూపమగు క్షణాల మధ్య
నిప్పు రాజేసిన పోరాటం
ఆకురాల్చే శిశిరం నుండి
చిగురించే వసంతానికి
చేరవేర్చే ప్లవం.

భయం చీకట్ల నుండి
పొద్దు పొడుపు కిరణాలను
ఒడుపుగా పట్టుకుని
ఉజ్వలమైన భవితలోకి
తీసుకళ్ళే అమృతగడియలు.

సంధికాలమంటే
రక్కసి ప్రతాపానికి
రాక్షసాంతానికి మధ్య
సమాలోచన జరిగే
నిశ్శబ్ద వ్యూహ సమయం.

శత్రువును
సమూలంగా
సంహరించడానికి
సంధించిన అస్త్రం,
ఆశల పంచాంగం
మళ్ళీ మనపేరిట లిఖించడానికి
రూపొందిన దస్త్రం!

-గంగశ్రీ
9676305949

ప్రకృతి సిరి

తనువు చీల్చి పెంచిన ప్రాణాలు
ప్రాణవాయువు అందక విలవిలలాడుతూ
ప్రాణాలు గాల్లో కలుస్తుంటే
మొక్కలు మౌనంగా రోదిస్తున్నాయి..!

అభివృద్ధి పేరుతో అడవులు నరికి
ఆకాశహర్మ్యాలు కోసం తరువులను చంపి
కాలుష్య పిశాచి కోరల్లో నలుగుతున్న
ప్రజల దుస్థితికి తల్లడిల్లుతున్నాయి..!

మానవాళి జీవితంలో వెలుగులు పెంచి
పరోపకారమే పరమావధిగా భావించే
వృక్ష సంపదను కాటికి పంపి
కరోనా రక్కసికి చిక్కి రోదిస్తుంటే
వృక్షజాతి విలపిస్తున్నది..!

మనిషి దురాశకు బానిసయై
తన గొయ్యిను తానే తవ్వుకుని
తిరిగిరాని లోకాలకు వెళుతుంటే
చెట్లు దీనంగా చూస్తున్నాయి..!

నిస్వార్థ జీవులైన వృక్షాలను
మానవుల కల్పతరువులైన పచ్చదనాన్ని
ప్రాణవాయువు ప్రదాతలను కాపాడుంటే
ఈ ఘోరకలిని ఆపేదానినని వాపోతున్నాయి..!

ఇకనైనా మొక్కలను విరివిగా నాటి
అడవులను బాగా పెంచి
ప్రకృతిసిరి బలాన్ని వృద్ధిచేస్తే
శత్రువులైన వైరస్ లను తుదముట్టించి
భవిష్యత్తు తరాలను కాపాడే అవకాశాన్ని
ఇవ్వమని చేతులెత్తి ప్రార్థిస్తున్నాయి..!

-పిల్లి.హజరత్తయ్య,
9848606573

సేంద్రియ సేద్యం

సేంద్రియ వ్యవసాయపు
దినసరి దినుసులే
ఆయువు పట్టుకు హేతువులు
తాజా పండ్లు
రోజూ వాడకములే
రోగాలకు చెంపపెట్లు
ఆకు కూరల కూరలతో
వండి వాడ్చిన తిండే
దేహాలకు బలనిరూపణలు
ఎరువులతో ఏపుగా పెరిగి
చీడ లేని చెట్టుకు
చిక్కటి
కూరగాయల గుత్తులతో
వేపుడు వేసిన తాలింపులే
రోగ నిరోధక శక్తికి సోపానాలు
సారవంతమైన నేలపై
శక్తివంతమైన కాడకు
బలమైన కాయల రుచులే
మనిషికి ఆరోగ్య పునాదులు
మట్టిలో ఒదిగిన
స్వచ్ఛమైన గింజలు
సేంద్రియ మందులతో
పచ్చగా మారిన ఆకులు
రైతు చేతి నుండి
స్వేచ్ఛగా కూడిన పంటలే
మనిషి ఆరోగ్య నిలకడకు
చక్కటి ఔషధాలు
రసాయనాలతో
బలవంతపు పెరుగుదలతో
మాగీ మాగని పండ్లు
మనిషికి కలిగించు రోగాలు
పశువుల ఎరువుతో
చెట్టు విదిలించిన విత్తనాలే
మనకు తరగని
ఆరోగ్యపు సిరులు
కరోనానైనా
సకల రోగాలనైనా
నిరోధక శక్తితో అంతం చేసే
పొలం విసిరిన
తాజా కూరలే ఆయుధాలు

- నరెడ్డుల రాజారెడ్డి
ఫోన్ : 9666016636

జీవన తీరాలు!

కలలు అలలై యెదలో మెదలి
కలవర పెడుతాయి నిను వదిలి

కాల గమనాన బ్రతుకులు కరిగి
ఏ ఒడికి చేరుతాయో తిరిగి!

గాలితో అలలు ఉరకలేస్తుంటాయి
అలజడులతో ఉప్పొంగుతుంటాయి

గాలి గమనానికి అలలు కదిలి
ఏ దరికి చేరుతాయో వడలి!

గుండెలో ఎన్నెన్నో అంశాలుంటాయి
అవి కలలోకథలై పలకరిస్తుంటాయి!

కడలిలోఎన్నో అలలులేస్తుంటాయి
తీరాలను తాకాలనిఘోషిస్తుంటాయి

అలల కడలికే ఆటు పోటులు!
నమ్మిన మనసుకే వెన్ను పోటులు!

గాలితోనే కెరటాలు చేరుతాయి-
సాగర తీరాలు!

ఆశతోనే బ్రతుకులు చేరుతాయి-
'జీవన తీరాలు'!

-పి.బక్కారెడ్డి
9705315250

జ్ఞానదీపం!!!

పనిలేని పిల్లి బుర్రలో ఉద్భవించిన
ఒక పిచ్చిమొక్క ఆలోచన
ఎరగామారి ముఖపుస్తక బోనులో పడితే చాలు
లైకుల ఎలకలు కొన్ని వలలో పడతాయి.
ఆత్మీయతతో అభినందించేవారొకరు
అభిమానం పంచేవారొకరు.
బాల్యపు లోతుల్ని స్పృశించి
గతకాలపు స్నేహగీతాలకు
కొత్తరాగాన్ని కట్టి ఆలపించేవారొకరు.
స్ఫూర్తి సందేశాల సమాహారాలు
విజ్ఞాన విషయ వ్యాస పరంపరలు
ఆపాత మృధుమధుర సంగీత
నృత్య చిత్రకళా విన్యాసాలు
అనునిత్యం హృదయరంజకంగా
అలరిస్తూ మురిపిస్తూ జ్ఞాన ఉషస్సులను
పెంచే పడమటి సంధ్యారాగాలే.
ఎప్పటికప్పుడు తాజా ముఖవర్ణస్సు
ముఖపుస్తకపు ఆశ్రితులకు వరమే.
ఇన్ని జ్ఞాపకాల అనుభూతుల పేజీలలో
అక్కడక్కడ విసర్జాలను వదలిన చెదపురుగుల్లా
కొన్ని కొన్ని చిరుగుల ఒయాసిస్సులు.
మనసు మనం నియంత్రించుకుంటే
ముఖపుస్తకమెప్పుడూ
అజ్ఞానుల జీవితాల సుజ్ఞాన దీపమే.!!!

-కొత్తపల్లి ఉదయబాబు
9441860161, 9533756075

గజలు

నీలిమబ్బునింగిలోన
నడయాడితె అందము
వానజల్లు పంటచేల
సడిచేయుట అందము
కలవరించె ప్రతిచోటులు పలకరించె
పనిబూనగ
పచ్చదనం పట్టుకున్న
చెట్టుపాట అందము.
శిరమునెత్తి చేయుపనులు
శిఖరకీర్తి నివ్వగా
గరికపోచ సరసమాడు
చినుకుముద్దు అందము.
పంచుటలోనె దాగిన
మంచితనము అక్షయము
పిట్టనోట పట్టువడిన
విత్తనఫలమందము.
ఎదుటివారి హృదయమ్ముల
కదలాడుటె కదా ఆస్తి
నదిని పెదవిపై మోసెడు
తీరము కథ అందము
కలుపుగోలు తనములోనె
గెలుపున్నది కాసర్లా !
కాలముఖమును చదివెడు
అక్షరసడి అందము!!

-డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

'డే' (కథ)

"హల్లో! స్వర్గమేనాండీ?" మత్తుగా ముద్దుముద్దుగా తడబడుతూ అడిగాడతను.

"అవును!" అవతల నుండి సమాధానం.

"అక్కడ... బెంగాల్ షరత్ గారుంటారు. కాస్త పిలుస్తారా?"

"ఆ పిలుస్తా... ఇంతకీ మీరెవరు?"

"నేను భూలోకం నుండి బ్రతికున్న మనిషినండి" కాసేపు ఫోనులో నిశ్శబం. తర్వాత-

"హలో...!" అవతల నుండి మరో కంఠం.

"హలో... బెంగాల్ షరత్‌గారేనాండీ"

"అవును... మీరెవరు?"

''నేను భూలోకంలో బ్రతికున్న మీ అభిమానినండి... మీ దేవదాష్ నవల చాలాసార్లు చదివానండి. షినిమా కూడా చాలాసార్లు చూషానండి... మీ వీరాభిమానినండీ"

"ఓహ్! అలాగా? థాంక్యూ... థాంక్యూ... ఇప్పటికీ నా నవలకి అంత క్రేజ్ వుందా?"

"వుండడమేమిటండీ... ప్రేమ బ్రతికున్నంత వరకూ మీ దేవదాస్, పార్వతి పాత్రలు బ్రతికే వుంటాయండీ"

"ఓహ్... అద్భుతం... ఇంతకీ నాకెందుకు ఫోన్ చేసారు?"

"నాదో చిన్న డౌటండీ"

"ఏమిటది?"

"దేవదాస్ పుట్టినరోజెప్పుడో చెబుతారా?"

"దేనికీ?"

"మా భూలోకంలో ఈ మధ్య 'ఫాదర్స్ డే", "మదర్స్ డే''లంటూ ప్రతి దానికో 'డే'లు పెట్టేస్తున్నారు. అలాగే మాలాంటి భగ్నప్రేమికులకూ ఓ 'డే' వుంటే బాగుంటుందని... అదీ దేవదాస్ పుట్టినరోజునే పెట్టుకుంటే బాగుంటుందనీ..."

"ఓసి పిచ్చివాడా! మన మందులబాబు లకి ప్రతిరోజూ 'మందు డే' నేరా బాబూ!'' నవ్వుతూ చెప్పాడు బెంగాల్ సెరత్.లీ

-చలపాక ప్రకాష్
సెల్:9247475975

అమరిక లేక...

ఎన్నో మధుర క్షణాలను
చెరిసగం పంచుకొని
ఆకాంక్షల్ని పెంచుకొని
కలుపు గోలుగా కాలం వొడిలో
నాలుగు వాత్సల్య వాక్యాల్ని ప్రోది చేసుకొని
సుదూర తీరాలను కొలుస్తూ
అలవోకగా ఆగిన
మజిలీ మజిలీలో సేద తీరుతూనే
మీ బ్రతుకు ప్రయాణాన్ని బాధ్యతగా
సంపూర్ణం చేసుకుంటూ..చేసుకుంటూ
ఇంతదూరం వచ్చారు కదా..
నాలుగు పదుల కాలంలో
అలుముకున్న అనురాగాల్ని
పెనవేసుకున్న ఐక్యతా భావాల్ని
ఒక్క క్షణికావేశం
ఇలా తుంచేస్తుందా..ఇలా తుడిచేస్తుందా..
ఆటుపోటుల అనుభవాల సారం
ఆరు పదులు మీరిన మీకు
అబ్బక పోవటమా
దిద్దుబాటులేని తప్పిదాలు
వార్ధక్యం వచ్చినవాళ్లే చేస్తుంటే
కాలం కనుపాపల్లో ఏదో నలుసు
ఎప్పుడూ తచ్చాడుతూనే వుంటుంది.
అమరిక లేని బ్రతుకు పాత్రలో
అమెరికా ప్రయాణం కూడా
టి కప్పులో తుఫానై కూర్చుంటుంది.
మరలుతున్న సూర్యోదయాల నడుమ
ఎన్నెన్నో దు:ఖపు చారల్ని
హత్తుకున్న మీ దేహాలు
ద్రవీభూత స్థితిని వీడి
దగ్ధహృదయ మవ్వటమేంటి
బాల్యం దాటి
కౌమార యౌవనాలు దాటి
వృద్ధాప్యంలోనూ ఈ ఆవేశమా..!
గృహస్థాశ్రమంలోని
గజిబిజీ గందరగోళాలనంతా
స్థిత ప్రజ్ఞతే స్థిమిత పరుస్తుంది
పుట్టుక నుంచి పుడమి గర్భంలోకి వొలికే వరకూ
జీవితం ఓ సమరమే అని గుర్తెరగాలి
పిల్లల్ని పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేసి
ఎన్ని మైలురాళ్లు దాటారో కదా..
మౌన ముద్రలో మరలిపోయే
చిన్న చిక్కుముడిని
విప్పుకోలేని అనాలోచితం
స్వేచ్ఛలన్నీ బందీలైన చోట
మీ వాదోపవాదాల విషాదాంతాన్ని
స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వెగటుగా వెక్కిరిస్తోంది
క్షణికావేశంలో కొండెక్కిన బ్రతుకు దీపాల్ని
చీకటి చిక్కగా పుక్కిలిస్తోంది

- డా.కటుకోర్వుల రమేష్
సెల్:9949083327

జల మొగ్గలు

అవని గర్భంలో పురుడుపోసుకుంటూ
ఆకాశ గంగై దర్శనమిస్తుంది జలం
అవని ఆకాశానికి జీవనాధారం జలం.

ముక్కంటీశ్వరుని తలలో గంగే
సమస్తజీవులకు ప్రాణదారమైతుంది
జలమే సమస్త సృష్టికి జీవనాధారం

పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తూ
పంచభూతాలకు ఆయువువైతుంది
పంచభూతాలు జలంతో పరవశిస్తాయి

మాగాణిమట్టిలో జీవకణము నింపుతూ
మణిమాణిక్యాలకు నెలవైతుంది జలం
మణిమాణిక్యాలకు మూలం జలం

సమస్త జీవానికీ ప్రాణాదారమైతూ
పచ్చని పొలానికి ప్రాణమైతుంది
పచ్చని పంటలకు ప్రాణాదారం జలం

తాను కాలంతో పాటు పయనిస్తూ
కరువు రక్కసిని తరిమికొడుతుంది
ఎతలను తీర్చే? అవనితడి జలం

మంచు కొండల్లో నీటిబిందువులైతూ
జీవనదులకు ప్రాణదారమైతుంది జలం
మంచు కొండల మణిహారం జలం

బొట్టుబొట్టు కలిసి పయనిస్తేనే
వాగువంకలు వరదలై పొంగుతాయి
బొట్టు బొట్టె బోడ్డెమ్మలై ఊగుతయి

వర్షపునీటిని వొడిసి పట్టుకుంటేనే
వనసంరక్షణ సదా పెరుగుతుంది
జలసంరక్షణనే వనసంరక్షణ

పాలమూరు ప్రాజెక్టు నిర్మాణాలు చేపడితే
తెలంగాణ మాగాణం సస్యశ్యామలమవుతుంది
ప్రాజెక్టులు పచ్చనిపల్లెలకు దేవాలయాలు

చెరువులను కల్పతరువులుగా మార్చేందుకే
మిషన్ కాకతీయ మనముందుకు వచ్చింది
రైతులకు నేస్తం మిషన్ కాకతీయ

నీరులేనిదే ఊరంత కూడా
వల్లకాడై ఎంత ఏల్లబొస్తది
నీరుంటేనే ఊరు నీరులేని ఊరు వల్లకాడే

పంటసిరులకు ప్రాణమౌతూనే
పశుపక్ష్యాదులకు ప్రాణదారమౌతుంది
జీవరాశికి ప్రాణము జలమేరన్న

పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తూ
ప్రపంచానికి వెలుగునిస్తుంది జలం
జలమే జాతికి బలము

ఎండమావులలో నీరై కనిపిస్తూ
ఎడారి జీవులకు జీవనాదారమౌతుంది
ఎడారి జలధార సింధు భారత జీవనధార

సమస్తజీవులకు ప్రాణాదారమైతూ
ఆకాశగంగై దుంకుతుంది జలం
నింగి నింపిన ప్రాణవాయువు జలం

మట్టి కుండలో మంచినీరే
దాహార్తిని తీర్చే జలమౌతుంది
మనిషిలోని ఆత్మకు జీవదార జలం

తొలకరి జల్లులై భువిని చేరుతూ
రైతు నుదుటిరాత మార్చుతుంది జలం
తొలకరి జల్లులు మణిమాణిక్యాల జలసిరులు

కరువురక్కసి గుండెల్లో దరువై
అన్నదాతల ఆత్మీయనేస్తాలు జలాలు
కరువు గుండెల్లో జలమే పిడిబాకు

ప్రతినిత్యం నీటితో కళకళలాడుతూ
నిరంతరం ప్రాణికోటికి జీవనాధారమవుతుంది
చెరువు లేని ఊరు తల్లి లేని పల్లె

రెండుతూములతో జలద్వారమవుతూ
పశుపక్ష్యాదుల దాహార్తిని తీర్చే కల్పతరువవుతుంది
తటాకాలే జీవరాశికి సంజీవని

ప్రతి కాలంలో జలసంజీవనిగా ఉంటూ
మన పంటపొలాలకు ఆయువు పోస్తుంది
రైతుల కష్టాలు తీర్చే నేస్తాలు చెరువులు

ప్రతి వానచినుకును ఒడిసి పడుతూ
వందల ఎకరాల మాగాణానికి జలసిరి అవుతుంది
జల భాండాగారాలు మన నీటిచెరువులు

పాడిపంటలకు జీవనాడి అవుతూ
ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నలకు బంధువవుతుంది
చెరువులు అన్నదాతలకు అపన్నహస్తాలు

నీలాకాశంలో నల్లని మేఘాలవుతూ
నీటి బిందువులై నేలరాలుతాయి
నేలరాలిన నీలిముత్యాలు జలాలు

ఎండమావిలో దర్శనమిస్తూ
తొలకరి చినుకులై పలకరిస్తాయి
ఎండిన పుడమి ఎదపై తడి జలం

పంచభూతాలకు ప్రాణాదారమైతూ
నవనాగరికతలకు ఆదెరువైతుంది
విశ్వనాగరికతల జీవం జలం

పశ్చిమ కనుమల్లో పురుడోసుకుంటూ
దక్షిణభారతానికి ప్రాణదారమైతుంది
దక్షిణాది గంగాధార గోదావరి జీవధార

త్రయంబకేశ్వరుని తడిపిన జలమే
కాళేశ్వరంలో కనువిందు చేస్తుంది
కాళేశ్వరాన్ని కడిగింది శివుడి జలం

జలము లేని జగతి అంటే
సిరాలేని కలము వంటిదే
జలము లేకున్నా జీవరాశి లేదు

రంగురుచి లేనిదై పారుతూ
ప్రకృతికి ప్రాణమై నిలుస్తుంది
జలము ప్రకృతికి ప్రాణాధారం

నెర్రలు బారిన నేలకి జీవం నింపుతూ
హలానికి ప్రాణంగా తోడు నిలుస్తోంది
నెర్రెలిచ

నటసమ్రాట్టు శతకం

-హెచ్.ఆర్. చంద్రం
సెల్: 9493248053









విరచింతును నటసమ్రాట్
చరితమ్మును క్లుప్తరీతి శతకముగా; నే
నెరుగ నెవరేని ఇప్పటి
వర కీ ప్రక్రియను దీని వ్రాయుట మిత్రా!

ఈయననే నటసమ్రాట్,
ఏయన్నార్, అక్కినేని, ఎవ్వర్ గ్రీన్ హీ
రో యనియు వ్యవహరించెద
రీయన అభిమాను లెల్ల నెప్పుడు మిత్రా!

ధరపై 'వెంకటరాఘవ
పుర' మను కుగ్రామమందు పుట్టెను నాగే
శ్వరరావు; నటనమున అని
తరు దనునట్టుల వెలింగె తదుపరి మిత్రా!

ఇత 'దక్కినేని' వంశజు,
డిత డాంధ్ర ప్రేక్షకులకు ఇష్టుడు, నటనా
క్రతు దీక్షితు, దత్యద్భుత
ప్రతిభావ్యుత్పత్తు లాస్తిపాస్తులు మిత్రా!

వీరిది కృష్ణాజిల్లా,
చేరువ 'గుడివాడ' కలదు; చిన్నతనమునన్
తారాడె నిచట, బ్రతుకున
పోరాడెను పిదప వృద్ధిపొందగ మిత్రా!

జనకుడు 'వెంకటరత్నం',
జననిని 'పున్నమ్మ' యంద్రు; సహజన్ముల నీ
తని సంఖ్య తొమ్మి, దీతడె
చిన వా, దుదయించినాడు చివరన మిత్రా!

పుత్రు లెనమండుగురు, నొక
పుత్రిక కలిగినను, అందు పుత్రిక మరియున్
పుత్రులు ముప్వురు పోయిరి!
పుత్రులు నిలిచి రయిదుగురు పుడమిని మిత్రా!

రైతు కుటుంబము వీరిది,
పాతిక యెకరాల పొలము, పరపతి యుండెన్
మోతుబరులు కాకున్నను,
ఆతత గౌరవము వీరి కయ్యెడ మిత్రా!

తన కైదేళ్ల వయస్సున
జనకుడు కాలమ్ముచేసె, జనక స్థాన
మ్మును పెద్దన్న గ్రహించెను;
తన కాయనె గురువు, మార్గదర్శియు మిత్రా!

పెద్దన్న 'రామబ్రహ్మం'
తద్దయు బాధ్యత వహించి, తమ్ముని బ్రతుకున్
దిద్దగ ప్రయాసపడి, తన
పెద్దరికము నిలుపుకొనుట విదితము మిత్రా!

కడగొట్టు బిడ్డ డౌటను
కడు ముద్దుగ పెంచుకొనిరి గానీ, అతనిన్
బడి మానిపించివేయుట
కడు దారుణ, మతని మనసు కలగెను మిత్రా!

బడి మానుకొన్న, లోకపు
బడిలో తా నభ్యసించె పాఠము లెన్నో!
ఒడుదొడుకు లెదుర్కొని నిల
బడె, విజయము లంది,, యశము బడసెను మిత్రా!

'బడి ఈడు' లోన నాతడు
బడి వీడెను గాని, 'చదువు' వదలక నేర్చెన్
నుడువ గలిగె నాతడు వడి
వడిగా, శుద్ధముగ నాంగ్ల భాషను మిత్రా!

చదుకొనలేక పోయిన,
చదువు విలువ తెలిసినట్టి సజ్జను డౌటన్
పదుగురు మెచ్చ 'విరాళము'
చదువుల సంస్థల కొసంగె చాలగ మిత్రా!

భూరి విరాళ మ్మిచ్చిన
కారణమున అతని పేరు 'కాలేజీ'కిన్
గౌరవముగ ఆ 'కమిటీ'
వా రొకటై పెట్టిరి 'గుడివాడ'న మిత్రా!

ఇరువది గంటలు రోజుకు
పరిశ్రమించుట నరునకు బహు కష్టంబౌ!
అరు దది, నాయక(హీరో) నాగే
శ్వరునకు చిననాడె సాధ్యపడె నది మిత్రా!

తన చిన్ననాటి క్రమశి
క్షణ గల వర్తనము ముందు కాలమునందున్
కొనసాగె జీవితాంతము
పునాదిగా నిలిచి వృద్ధిపొందగ మిత్రా!

చిననాట తాను నాటక
మున నారద పాత్ర దాల్చె మొదటగ, ఆపై
తన వన్నియు స్త్రీ పాత్రలె!
జను లభినందించినారు చాలగ మిత్రా!

చూపరుల మెప్పు గొనె నా
రూపము, గాత్రమ్ము, నటనలో నైపుణ్యం;
బే పాత్ర దాల్చినను, తా
నా పాత్రకు చేసినాడు న్యాయము మిత్రా!

'ఇదె' నీకు తగిన పని యని
పదేపదే పెద్దవారు పలుకుటచే, తా
నెదిరించలేక, 'ఔ' నని
కుదురుగ నటనమును నేర్చుకొనె మరి మిత్రా!

పెద్దన్న తీవ్ర యత్నము,
పెద్దల తోడ్పాటు తనను వేగిర పరచెన్
వద్దనగల వయసా అది?
పెద్దలు చెప్పినదె తనకు వేదము మిత్రా!

నటనె తన జీవిత మ్మని,
'నటసమ్రాట్' బెడు ననియు నా దనుకొనెనా?
నటనపయి తనకు లే ద
ప్పటిలో నొక స్పష్టమైన భావము మిత్రా!

ఒడుపుగ పనిచేయుట, నిల
బడి కష్టము నెదురుకొనుట, పట్టిన దానిన్
విడువక సాధించుట అల
వడి బాల్యమునందె ఒంటబట్టెను మిత్రా!

చేతలు గని చిననాటనె
'మూత ఘనము, పిట్ట జూడ కొంచమె!' యనుచున్
ఈతని మెచ్చిరి పెద్దలు!
ఆ తరువా తదియె నిక్క మయ్యెను మిత్రా!

మనువాడె 'అన్నపూర్ణ'ను,
తనయుల, తనయలను గాంచె, దాంపత్యమునం
దున తనిసె నాత; డెందరి
కనుకూల కళత్రభాగ్య మబ్బును మిత్రా?

'నటసమ్రాట్' అను బిరుదము
'చటుక్కున' లభించలేదు; సామర్థ్యము గ
ల్గుట పెద్ద లిచ్చి, రదియే
అటుపై వ్యవహార నామ మయ్యెను మిత్రా!

ఏ రంగమందు నైనను
తారస్థాయికిని చేర దలచిన వారల్
పోరాడవలయు, నప్పుడె
చేరెద రది; యితడు నటులె చేసెను మిత్రా!

ఒక్కొక్క మెట్టు క్రమముగ
నెక్కుచు 'ఎవరెస్టు శిఖర' మెక్కెను నటన్
పెక్కు బిరుదములు వరుసగ
దక్కెను గుర్తింపు గలవి తనకున్ మిత్రా!

అరుదగు సన్మానమ్ములు,
బిరుదులు, బహుమతులు లెక్కపెట్టుట తరమా?
వరియించి వచ్చె, నర్హత
నెరిగి వరుసగట్టి వారి కెన్నియొ మిత్రా!

అని రాతని 'పద్మశ్రీ'
మును, తదుపరి అనిరి 'పద్మభూషణు'డని, ఆ
వెనుకను 'పద్మవిభూషణు'
డని ఏలినవారు పొగడి రాతని మిత్రా!

'దాదా సాహెబ్ ఫాల్కే'
ఆదరముగ వీరి కిచ్చి, రది ఉచితమ్మౌ;
ఈదృశ నట దిగ్గజమును
కాదనగల గౌరవములు గలవా మిత్రా?

ఘన నేత పేరు సైతము
వినని మనుజు డుండవచ్చు, వివరమ్ములతో
తన నంద రెరుంగుదు! రిదె
మునుముందుకు నటుని ద్రోయు ముచ్చట మిత్రా!

ప్రతిభా వ్యుత్పత్తులు గల
ప్రతి నటుడును చలనచిత్ర రంగమ్మున ఉ
న్నతి పొందు ననుట కల,ఉ
న్నతి నవకాశమ్ము లిచ్చు నటులకు మిత్రా!

ఇన్నూరు పైన నేబది
కన్నను నధికముగ దాల్చె కమనీయములౌ
మన్నిక గల పాత్రలు వా;
రన్నింటిని విశదపరచు టగునా మిత్రా?

తన చలనచిత్ర జీవిత
మున మొదటిగ 'ధర్మపత్ని' బోణీ కొట్టెన్
తన పాత్ర చిన్నదే యై
నను మొదటిది! చెప్పుకొనుట న్యాయము మిత్రా!

తొలి నాళ్ల 'బాలరా' జొక
కలకలమును రేపె ప్రేక్షకాళిని దోచెన్
నిలబెట్టె తనను నటునిగ,
బలమైన పునాది నాడె పడినది మిత్రా!

ఏడాది పైన అయ్యది(బాలరాజు)
ఆడెను తొలి విడత, దాని నారోజులలో
చూడని వారే లేరట!
వేడుక పలు మార్లు గనిరి పెక్కురు మిత్రా!

ఇల 'దేవదాసు' పాత్రను
పలువురు నటియించి యుండవచ్చును గానీ,
తుల లేదు వీరి నటనకు!
నలుగురు మెచ్చినదె మేలి నటనము మిత్రా!

ఎప్పటిదో ఆ చిత్రము!
ఇప్పటికి 'తెనాలి రామకృష్ణ'ని పాత్రన్
గొప్ప దని చెప్పుకొందురు!
అప్పట్టున వారి నటన మట్టిది మిత్రా!

'చాణక్య' సచివు పాత్రను
వేనోళ్లను పొగడ దగిన విధముగ చేసెన్
ఆ నటనా వైదుష్యము
శ్రీనాగేశ్వరు డొకరికె చెల్లును మిత్రా!

సందేశాత్మక చిత్రా
లందించిన ఘనత గూడ అతనికి దక్కెన్
అందొక్కటి 'సుడిగుండా';
లం దాతని నటన చెప్ప నౌనా మిత్రా?

అతి జాగ్రత్తగ జూచిన,
ప్రతి చిత్రమునందు కానవచ్చును ప్రత్యే
కత యేదే నొక్కటి! బా
ధ్యత నెరిగిన నటుడు దారి తప్పదు మిత్రా!

జానపద మైన, సాంఘిక
మైనను, చారిత్రకమ్మె యైనను, నగు పౌ
రాణికమును, పాత్రోచిత
మౌ నటనమె చేసి మెప్పు లందెను మిత్రా!

చిత్రము! కా డిత డెత్తరి,
గాత్రములో కానరాదు గాంభీర్యము; ఏ
పాత్రను గొనిన ప్రశంసా
పాత్రమె! తుల గాన మితని ప్రతిభకు మిత్రా!

వెండితెర పైన హాస్యము
పండించిన హాస్య నటులు పలువురు కల; రీ
తండును హాస్య రసమ్మును
మెండుగ నందించె మంది మెచ్చగ మిత్రా!

తల్లికి తండ్రికి కొడుకుగ,
ఇల్లాలిని తృప్తిపరచు హృదయేశునిగా,
పిల్లలకు కూర్మి తండ్రిగ
నెల్లర మెప్పించె నటన నీతడు మిత్రా!

కవి సృష్టించిన పాత్రల
నవగాహన చేసుకొనుచు, అభినయమున తా
నవిరళ కృషి యొనరించుచు,
నవ నవ మార్గముల బట్టి నడచెను మిత్రా!

రవి గాంచనట్టి దానిని
కవి గాంచునొ లేదొ గాని, కవి హృదయమ్మున్
వివరించ గలిగె నీతం
డవిరళ కృషితోడ నభినయమ్మున మిత్రా!

తా నొకరి ననుకరించక,
తానే ఒక నూత్నశైలి తగ నెలకొల్పెన్
దానికి ప్రేక్షకు లెల్లరు
'ఔ' నని తలయూచి మెచ్చి రాతని మిత్రా!

పొంగుట సహజము పొగడిన,
క్రుంగుట సహజమ్మె విన్న కువిమర్శలు, తా
నింగిత మెరింగి, అవి దిగ
మ్రింగి నటించెను మరింత మెప్పుగ మిత్రా!

నాయక పాత్రలు కానివి
చేయవలసివచ్చె కొన్ని; చిన్నవె యైనన్
చేయవలె వానికిని తగు
న్యాయము నటు దనుచు తలచె నాతడు మిత్రా!

నిజ నటనా చతురిమతో
నజరామర పాత్ర లెన్నొ ఆవిష్కృతమై
ప్రజల హృదయాల దోచెను,
ప్రజ లతనికి బ్రహ్మరథము పట్టిరి మిత్రా!

అల్ప మగు పాత్రలందు న
నల్ప విశేషముల జూపు నాతని నటనా
శిల్పమునకు జోహారులు
సల్పక యెట్లుండ గలరు సరసులు మిత్రా?

జరిపె నతడు వజ్రోత్సవ
మరువది చిత్రములు పూర్తియగు తరుణమునన్
జరిపి రభిమానులును సం
బరములు స్పందించి రాష్ట్ర మంతట మిత్రా!

నాగేశ్వరరా వుండిన
బాగుండును చిత్ర మన్న భావన బహుధా
సాగిన కాలమ్మును గల,
దా గొప్పతనమ్ము దక్కె నతనికి మిత్రా!

ఆ పాత చిత్రముల గన
నాపాతము మధుర మగుచు నలరించును, స
ద్యాపనకు లోటు గలుగదు,
చూపరు లవ్వాని గోరి చూడరె మిత్రా?

వీరు నటించిన చిత్రము
లారయ ఇన్నూట యేబదా రున్నవి! ఆ
పేరులు, కథావిశేషము
లేరుపరచి చెప్ప సాధ్యమే యిట మిత్రా?

నవ రసము లుండె లెక్కకు,
అవి ఒక్క విధాన ప్రేక్షకాళిని అలరిం
చవు, హెచ్చు తగ్గు లందు గ
లవు, శృంగార మ్మగు రసరాజము మిత్రా!

రసరాజ మైన శృంగా
ర రసము పోషించె నితడు రమ్యముగా చూ
పరులు తిలకించి తనియ, ని
తర రసములు గూడ చేసె తరచుగ మిత్రా!

శ్రుతి మించని శృంగారము
ప్రతిభావంతముగ, 'చిత్ర పాత్రోచితమౌ'
గతి నభినయించి, ప్రేక్షక
తతులను మెప్పించె నితడు తద్దయు మిత్రా!

ప్రేమ కథలందు నీతని
సామర్థ్యము చెప్ప తరమె? సహజమొ? నటనో?
ఏమో! యెవ్వ రెరుంగుదు?
రా మాంత్రిక నటుని శక్తి అట్టిది మిత్రా!

కృషికి అసాధ్యము కలదా?
హుషారు పాత్రలను దాల్చి ఒప్పించిన ఆ
కృషికు డదే నైపుణ్యము
విషాద వేషముల జూపె ఔషగ మిత్రా!

ఆస్తికులు చూచి పొగడగ
ప్రస్తుతి పాత్రముగ జేసె భక్తుల పాత్రల్
వాస్తవముగ నితడు పరమ
నాస్తికు! డిది గొప్ప కాదె నటునకు మిత్రా?

పలు చిత్రముల నటించి త
మిళ భాషను, నచటి వారి మెప్పులు పొందెన్
అల హిందీ రంగమ్మున
గల దాతని పాత్ర కొంత, కాంచితె మిత్రా?

తన వెనుక ప్రవేశించిన,
తనకుం దగు 'ఉద్ద' యైన తారకరాముం
డును తాను కలసి చేసిరి
అనేక చిత్రములు, 'హిట్లె' అన్నియు మిత్రా!

నటసమ్రాట్టుకు సాటిగ
'నటరత్న' వెలుంగుచున్న నాళుల స్పర్థల్
నటనమున సాగినందున
నటద్వయము వన్నె బెంచె నటనకు మిత్రా!

యువ పాత్ర లభినయించుట
యువ నటులకు చెల్లు, ప్రాయ ముడిగిన నాడున్
యువకులతో పోటీపడి
యువ పాత్రలు చేసె నీత డొప్పుగ మిత్రా!

అల 'ఘంటసాల' పాటల
కలవోకగ నభినయించి, అభిమానుల మె
ప్పులు గొన్న సన్నివేశ
మ్ములు కల వాయనవి పెద్ద మొత్తము మిత్రా!

నాయికలు యుగళగీతము
లీయనతో కలసి అభినయించుట యన్నన్
ప్రాయికముగ నది పోటీ
యే యగు, నటనాసమర్థు డీతడు మిత్రా!

అడుగులు(స్టెప్పులు) వేయుటలో ఈ
తడు నేర్పరి, ప్రథము డనుట తథ్యము; తారల్
తడబడుదు రితని సరసన
అడుగులు కలుపుటకు నాట్యమందున మిత్రా!

వయసు పయి బడిన మీదట
వయసుకు తగినట్టి కొన్ని పాత్రలు చేసెన్
వయ సుడుగుట దేహమునకె!
వయ సుండదు గొప్ప నటుల ప్రతిభకు మిత్రా!

వీరి సరసన నటించిన
'తారల' లెక్కింపు గగన తారల వలెనే!
ఆరయ మూడు తరమ్ముల
వారు కథానాయిక లయి వరలిరి మిత్రా!

ఘన విజయములను సాధిం
చెను నాగేశ్వరుని పెక్కు చిత్రము;లన్నిం
టిని సవివరముగ దెల్పుట
అనువగునా ఒక్క శతకమందున మిత్రా?

ఏ యొక్క చిత్రమందును
ఈయన నటనమ్ము గూర్చి యే ప్రేక్షకుడున్
చేయడు కువిమర్శన, మది
యే యీయన ఘనత చాటు నెంతయు మిత్రా!

సహ నటుల కెల్లరకు తన
సహకారము నందజేసి సహృదయపరుడై,
బహుధా ప్రశంస లందిన
మహానటుడు 'అక్కినేని' మాన్యుడు మిత్రా!

ఆత డొక మహానటుడని
యే తెలియును, పెక్కు లోకహిత కృత్యములన్
బ్రాతిగ చేసిన వైనము,
నేతత్ఫలితములు జనత యెరుగదు మిత్రా!

తన దగు ప్రయత్న ఫలముగ,
తన స్వగ్రామమ్ము ప్రజలు తనియగ, నొక వం
తెన 'అక్కినేని వారధి'
యని తన పేరున వెలసిన దక్కడ మిత్రా!

ఆ నా డొక స్థితి నందగ
తా నెంత శ్రమించినాడొ తనకే తెలియున్
ఏనాడును నొక నిమిష
మైనను వృథచేసి యెరుగడాయెను మిత్రా!

తిండియు, తగు నిద్రయు లే
కుండిన సమయాలు చాల ఉండెడి వపు! డ
ట్లుండె నని తగ్గుచో, ని
ట్లుండెడి అవకాశ మెట్టు లొదవును మిత్రా?

ఎడనెడ స్వీయ సుఖమ్ములు
విడువక యెవడైన గాని వృత్తెది యైనన్
కడు నున్నతి పొందగ జా
ల డనెడి నిజ మెరుగు నితడు ప్రాజ్ఞుడు మిత్రా!

తలగుడ్డను ఏయన్నార్
వలె జుట్టుకొనంగ మోజుపడిరట ఆ రో
జుల నెందరొ కర్షక యువ
కులు చిత్రములందు జూచి గొప్పగ మిత్రా!

తననే ఆదర్శముగా
గొని యువతులు, వరుల నెన్నుకొనుచో ఆ ల
క్షణములకై వెదకుట ఆ
దినముల పరిపాటి యగుట తెలియును మిత్రా!

తెలుగు సినిమా నిచటకు త
రలించ సమకట్టినట్టి ప్రథములలో ము
ఖ్యులు ఏయన్నార్ అనునది
తెలుగుల నందరికి బాగ తెలియును మిత్రా!

సినిమా నిర్మాణమునకు
అనువగు నొక 'స్టూడియో'ను అతి శీఘ్రముగా
తన భార్య పేర నిట భా
గ్య నగరమున నితడు పూని కట్టెను మిత్రా!

పలు జనరంజక చిత్ర
మ్ములు తమ నిర్మాణ సంస్థ పొల్పుగ తీసెన్
తొలి నుండి నేటి వరకును,
విలువలు నిలబెట్టుకొనిరి విజ్ఞులు మిత్రా!

తన నటన లోక విదితము,
తన పుత్రుడు నటనమందు తగ పేరొందెన్
తన పౌత్రులు నటు లాయిరి,
తన దౌహిత్రులును వేషధారులె మిత్రా!

నాగార్జున ప్రముఖ నటుడు,
నాగేశ్వరరావుగారి నందను, డతడున్
బాగొ నటనముతో వే
వేగముగా వచ్చినాడు వృద్ధికి మిత్రా!

పుత్రునితోపా టిరువురు
పౌత్రులు నీ వెండితెరకె వచ్చిరి, మరి దౌ
హిత్రులు నిరువురును చలన
చిత్రమ్ములలోనె వచ్చి చేరిరి మిత్రా!

నాలుగు తరముల
(తాత-తండ్రి-కొడుకు-మనుమడు) పాత్రలు
లీలగ తా నభినయించె ప్రేక్షక జనముల్
'మేలు, భళా!' యని పొగడగ,
కాలమును జయించు నటుడు గావున మిత్రా!

ఇట రాజకీయమందున
నటులకు ప్రాధాన్య ముండె, నటసమ్రాట్ ఆ
కిటుకుల నెరింగి యుండియు
అటువై పొకనాడు చూడదాయెను మిత్రా!

దేవుడు శాసించడు తన
జీవిత మని యెంచి, తాను చేసిన కృషియే
జీవిత పరమార్థమ్మని
భావించిన యితడు వాస్తవజ్ఞుడు మిత్రా!

ప్రతిచిత్ర పాత్ర వేరొక
బ్రతుకే అనునట్లు తాను భావించి, పర
శ్శత జీవితానుభవముల
జితించుకొన గలిగె, నది విశేషము మిత్రా!

తనదౌ సుదీర్ఘ జీవిత
మున నెన్నియో అనుభవాలు, ముచ్చట! లవి యె
ల్లను గ్రంథస్థము చేసెను
జన హితమును కోరుకొన్న జ్ఞానిగ మిత్రా!

తన పుత్రునితో, నిరువురు
మనుమలతో కలసి చేసె 'మన' మను చిత్ర
మ్మును మెచ్చ ప్రేక్షకులు; ఆ
యన కదియే చివరి చిత్ర మాయెను మిత్రా!

తొమ్మిది పదుల వయస్సున
ఇమ్మహనీయుండు నటన మింపుగ జేసెన్
సమ్మదమున ప్రేక్షక జను
లి మ్మహితాత్ముని స్తుతించి రెంతయొ మిత్రా!

ఈతడు మహానటుండని
ఖ్యాతి వహించెను స్వకీయమౌ కృషి చేతన్
పూత చరితులకు విజయము
లీ తీరుననే సతము లభించును మిత్రా!

నటునిగ బ్రతుకును మొదలిడి,
అటునిటు గనకుండ నడచి, ఆ మార్గమునన్
నటునిగ తనువు ముగించిన
నటసమ్రాట్ నూరుపాళ్ల నటు డగు మిత్రా!

నటధర్మ మెరిగి, వృత్తిగ
నటనమ్మునె స్వీకరించి, నటసమ్రాట్టై,
నటనకు నిఘంటు వగు ఆ
నట మూర్ధన్యునకు వందనమ్ములు మిత్రా!

నీతినియమాలు గలిగిన
చేతులు జోడించి నిలుచు జీవిత మని, ఆ
రీతిగనే కొనసాగిన
ఆతని ఆదర్శమునకు అంజలి మిత్రా!

'గుడివాడ' పట్టణమ్మున
నడయాడెను చిన్ననాట నాగేశ్వరు; డ
క్కడ వారి(ఏయన్నార్) కళాశాలం
దిడి రాయన విగ్రహమ్ము నిమ్ముగ మిత్రా!

జనుల హృదయాల దోచిన
ఘన నటనాకౌశలమ్ము గలిగిన నటులన్
జను లెట్లు విస్మరింతురు?
కొనియాడుచు తరచు తలచుకొందురు మిత్రా!

ఇల కవుల, మరి కళాకా
రుల మరణము భౌతికమ్మె, లోకమ్మున వా
రల కీర్తి కాయములు ని
శ్చలములు, శాశ్వతము లనుట సత్యము మిత్రా!

బ్రతుకున విజయుండై, శా
శ్వత కీర్తి గడించి, జన్మ సార్థకముగ జీ
వితమును గడపిన ధన్యుని
కత అధ్యయనమ్ము చేయగావలె మిత్రా!

ముగిసె నొక శకము నటనా
జగత్తున నితండు తనువు చాలించుటచే;
తగ, శక పురుషుల ఒరవడి
ముగియక కొనసాగు వారు పోయిన మిత్రా!

మన తెలుగు భాష భువిపై
మని యుండెడినంత వరకు మరుగున పడ దీ
జనహృద్ధాముని నామము!
అనిశము రవళించు , నీత డమరుడు మిత్రా!

ఇది నటసమ్రాట్ శతకము,
పదిమందికి నచ్చు కంద పద్యములందున్
మృదుమధుర శైలి వ్రాసితి;
చదువరులు గ్రహింతురేని చాలును మిత్రా!

(20 సెప్టెంబర్, నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావుగారి 98వ జయంతి)

గళం విప్పుతున్న కలాల లోకం

కలాలకు కులం లేదు -మతం లేదు
దేశం దేశం లేదు -ద్వేషం లేనే లేదు
కలాలను కటకటాల్లో పెడితే
కలాలన్నీ ఏకమై ఈటెల్లా మారి
సంకెళ్లు త్రెంచి
కొత్త సిరాతో పరుగెత్తుతాయి.

కలాలు కొన్ని కాసులకు కక్కుర్తిపడి
కలాల గళం నొక్కేస్తున్నా
కల్లలులేని కలాలుకల్సి
కళంకితుల్ని కాల సర్పమై కాటేసి
కాటికి పంపుతున్నాయి
కలకలంలేపే సమాచారంతో
లోకాన్ని అతలాకుతలంచేస్తున్నా-
నీతిగల కలాలు వాటిని అంతంచేస్తున్నాయి
గతీ-సుతీ లేని -మతిలేని కలాలను
కాల గర్భంలో కలిపేస్తున్నాయి
అరాచక -కురాజకీయాల చెంతచేరిన
కలాలువంతపాడినా
కలంలోకొత్తసిరానింపుకొని
కట్టలుత్రెంచుకున్న ఉత్సాహంతో
కళంకిత కలాలను చెండాడుతున్నాయి
నీతి -నియమాలతోన్యాయం-ధర్మంతో
కలాలు కల కల లాడుతాయి కలాలకు
కులం లేదు - మతం లేదు
దేశం లేదు -ద్వేషం లేనే లేదు.

-బైస హరిదాస్ ఆర్య
9849259011

గజ్జెల సవ్వడి

అల్లారు ముద్దుల చిట్టి తల్లి
అడుగులో అడుగు వేస్తూ తూలుతూ
ఇల్లంతా తన పాద స్పర్శలతో
కేరింతలు కొడుతూ ఆడుతుంది.

అమ్మ వంట గదిలో కూరగాయలు
తరుముతు ఆ చిన్నారి శబ్దముతో
కదలికలను గమనిస్తుంది.

సోపాలో కూర్చున్న అవ్వ
మనుమరాలి అల్లరికి కోట్లు
సంపాదించినంత ఆనందంలో ఉంది
ఆఫీస్ కి సిద్ధం అవుతున్న నాన్న
కూతురి ముఖం లో తనని
చూసుకుంటున్నాడు.

వరండాలో వీల్ చైర్ పైన తాత
చుట్ట పీలుస్తూ న్యూస్ పేపర్
చదువుతూ గజ్జెల సవ్వడిలో
ఉన్న సంగీతాన్ని ఆస్వదిస్తున్నాడు.

ఒక ఆడపిల్ల ఆనందం
ఇంటికి వెలుగు.

ఆడపిల్లలను రక్షించుకుద్దాం!
సుఖ సంతోషాలతో జీవిద్దాం!!

-మిద్దె సురేష్
9701209355

గజల్..

నిను చెరచిన రాక్షసుడిని నరకాలని నాకున్నది
నిను నులిమిన మృగాడినే చంపాలని నాకున్నది.
చట్టానికి లోబడుతూ ఎన్కౌంటర్ అనగలేను
పెన్కౌంటర్ వేసిమరీ అడగాలని నాకున్నది,.
వగచుతున్న ఓ అమ్మగ నింపాదిగ ఉండలేను
నిను చంపిన దుష్టుడినే చీల్చాలని నాకున్నది.
కామాంధుని చెరననీవు ఎంత బాధపడ్డావో
వాణ్ణి నరికి పోగులుగా పోయాలని నాకున్నది.
ఆడపిల్లనైతేనేం స్వప్నాలకు తావున్నది.
కీచకులకు కాళికగా మారాలని నాకున్నది

(ఇటీవల హైదరాబాద్లో...ఆరేళ్ళ పాప(చైత్ర)పై జరిగిన అత్యాచారం ,హత్య ఘటనపై స్పందిస్తూ...).

-స్వప్నకృష్ణ
9440536669

ఓ న్యాయదేవతా..

ఉగ్గు పాలు తాగే
పసికందుల బాల్యం
తల్లి ఒడిలో ఉయలూగాల్సిన
నునులేత ప్రాయం
చదువుల వెలుగులతో
వెలగాల్సిన బాలికల భవితవ్యం
నేడు కామాంధుల కసాయత్వానికి
బలియవుతుంటే
అత్యాచారం శాంతికపోతం శీలం తెంచి
విహరిస్తుంటే
వెక్కి వెక్కి ఏడుస్తున్నది
విశాల భారతం
ఈ విషాద ఘటనలు చూసేటందుకా
నాకీ స్వేచ్ఛ అంటూ ప్రశ్నిస్తోంది
స్వతంత్ర భారతం
కంతలు కట్టుకున్న ఓ న్యాయదేవత
కనుగంతలు విప్పి ఓసారి చూడమ్మా
కాముకత తో కన్నులు నిండిన
ఈ కబోధి జీవులను
ఇకనైనా బలి తీయవమ్మా..
శిక్షించవమ్మా..??

-కవిశ్రీ
9493785596

'టీ' యని ముచ్చట

ముసుగుతన్ని పడుకున్న ఇల్లు
ఒళ్ళు విరుచుకుంది నీ పరిమళంతో
మోసుకొచ్చిన యాలకుల సుగంధం
అందరినీ తట్టిలేపుతున్నతట్లుంది
రాత్రి పగల్లా పాలు తేయాకు కలిసిపోయి
అరుణిమను దాల్చిన
సాయం సంధ్యకుమల్లె కప్పులో
టీ కనువిందు చేస్తున్నట్లుంది
అప్పుడే వచ్చి వాలిన పక్షిలా
న్యూస్ పేపర్ చూపులతోనే గుటకలేస్తోంది
అందుకే కాబోలు వార్తలన్నీ వేడెక్కివున్నాయి
చదువుతుంటేనే చుర్రుమంటున్నాయ్
ఒక్కొక్క సిప్పు గొంతు దిగుతుంటే ఇంకా
ఉదయించని సూర్యుడు కనపడకుండా
దాక్కుని వెచ్చదనాన్ని అప్పుగా ఇస్తున్నట్లే
అనిపించింది
అధరానికి అమృతం దొరికినట్టు
అపురూపంగా
నిన్ను ఆస్వాదిస్తుంటే ఏదో తెలియని
అవ్యక్తభావం నీ గురించి చెప్పకనే చెప్పింది
ఆ 'టీ'యని అనుభవంతో
మనసు లేడి పిల్లలా చెంగుమనడం
గమనించనేలేదు కప్పు ఖాళీ అయ్యేదాకా..



-మంజుల సూర్య
9704022244

ఆహ్వానము
హరిదా రచయితల సంఘం, నిజామాబాద్
సామాజిక, సాహిత్య సౌజన్య మూర్తి డా॥ మద్దూరి సాయిబాబు రచించిన
మెతుకు లేని అనాథ బతుకులు (హృదయవిదారక యథార్థగాథలు)
పుస్తక ఆవిష్కరణ
వేదిక: కేర్ డిగ్రీ కళాశాల, తిలక్ గార్డెన్స్, నిజామాబాద్
తేది: 17-09-2021, శుక్రవారం, ఉదయం గం॥ 10.30 లకు



ముఖ్య అతిథి:
డా॥ గంటా జలంధర్ రెడ్డి,
అధ్యక్షులు, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి, హైదరాబాద్
సభాధ్యక్షులు:
శ్రీ ఘనపురం దేవేందర్,
అధ్యక్షులు, హరిదా రచయితల సంఘం, నిజామాబాద్
గౌరవ అతిథి:
శ్రీ నరాల సుధాకర్,
అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం, నిజామాబాద్ జిల్లా
పుస్తక సమీక్ష
డా॥ కాసర్ల నరేశ్ రావు,
ప్రధాన కార్యదర్శి, హరిదా రచయితల సంఘం, నిజామాబాద్
స్వాగతం:
శ్రీ తిరుమల శ్రీనివాస్ ఆర్య,
ఉపాధ్యక్షులు, హరిదా రచయితల సంఘం, నిజామాబాద్
వందన సమర్పణ:
శ్రీ గంట్యాల ప్రసాద్,
కోశాధికారి, హరిదా రచయితల సంఘం, నిజామాబాద్

కవులు, రచయితలు, కళాకారులు, సాహితీ వేత్తలు...
సాహితీ అభిమానులు, సామాజిక సేవా కార్యకర్తలు.. అందరూ ఆహ్వానితులే...
బలగమంత రావాలె - రచయితను దీవించాలె...

ఇంకేదప్పుడే !

నీళ్లు మాట్లాడవేమో కానీ
కన్నీళ్లు మాట్లాడతాయి
అవి గుండెల్లోంచి
ఉబికి వచ్చాయి కదా! అంతే

ఆకాశానికీ భూమికీ నడుమ
వర్షం వాహకమైనట్టు
మనసుకూ కళ్ళకూ నడుమ
కన్నీరు వాహకమైంది.

వాహకమైన కన్నీళ్లిప్పుడు
ప్రశ్నిస్తున్నాయి
అభిజాత్యపు విషపు కణాలు
నీ రక్తంలోకి ఎక్కించిందెవరని ?
విభజించే విష సంస్కృతి
నీ మెదడులోకి చొప్పించిందెవరని?
హెచ్చుతగ్గులు పోయి
ఎర్రబడ్డ చెక్కిలిపై
తాము ఆనంద భాష్పాలమై
తాండవమాడేదెప్పుడని?

నీ మనసు కొలనులో
ప్రేమ కలువలై పూయాలి
మానవత్వపు దారంతో
హృదయ పుష్పాలు మాలగా గుచ్చబడాలి
సమభావనా చిత్రం
నీ హృదయ కాన్వాసుపై గీయబడాలి
సమదృష్టి
నీ కళ్ళల్లో వెన్నెలై కురవాలి
శాంతి పతాకమై నీ గుండెల్లో ఎగరాలి
అప్పుడే కదా ! కన్నీరింకి
ఆనందభాష్పాలు
బయటకొచ్చి తాండవమాడేవి

– ఎన్.నరేశ్ చారి
9701334516

పక్షుల స్వగతం

సూర్యోదయానికి జామచెట్టుమీద
చిలకలు వాలుతున్నాయి
మావికొమ్మ మీద
కోయిలలు పాడుతున్నాయి
వేపచెట్టుమీద పులుగులన్నీ
కువ కువలాడుతూ గోలచేస్తున్నాయి
కొబ్బరి చెట్టుమట్టలలో ఉడతలు
కిచ కిచ లాడుతూ తిరుగుతున్నాయి
కనుమరుగయిన బుర్రుపిట్టలు
ఇళ్ళల్లో కొచ్చి మళ్ళీ అందమైన
గూళ్ళుపెడుతున్నాయి
జంతువులన్నీ స్వేచ్ఛగా తిరుగుతున్నాయి
పుట్టలోని పాములు జరజరమంటూ
పాకిపోతున్నాయి
మనకింత స్వేచ్ఛ లభించినదేమిటి
పర్యావరణాన్ని కలుషితం చేసిన
ఈ మానవజాతి కేమయింది
' క రోన ' చెయ్యొద్దంటే తెలుసుకోలేక వినక
' కరోనా ' అనే అంతుబట్టని
వ్యాధికి బలి అవుతున్నారే
ఎక్కడి వారక్కడే బందీలయినారే
మోటారుబండ్ల రణగొణలు లేవు
లోహవిహంగాల హడావిడులు లేవు
కాలుష్యపు గాలులు లేవు
స్వచ్ఛమయిన గాలులచాలులలో
రెక్కలల్లార్చుకుంటూ
స్వేచ్ఛగా ఎగరవచ్చునని
రాజహంసలవలె కొంగలన్నీ
ఆనందంతో బారులుతీరిన
కర్మసాక్షికి స్వాగతం పలుకుతున్నాయి.

–డా.మైలవరపు
లలితకుమారి
9959510422

అమృతభారతీ...!

స్వతంత్ర భారతీ
స్వర్ణ భారతీ...
అమర వీరులు పోరిన
అమృత ధీమతీ..
స్వతంత్ర భారతీ...!

త్యాగ భారతీ
యోగ భారతీ..
సకల ప్రజాభీష్ట
శ్రేయోదాయినీ..
ఆనంద భారతీ..!

దినదిన ప్రవర్ధమానినీ
శాంతిక్రాంతి అహింసా
ప్రగతి దారుల్లో సాగే..
సకల రంగ ముందు
సవ్య ధీమణీ..!

డెబ్బైఐదు వత్సరాల
ధైర్య శౌర్య స్ఫూర్తిమానినీ
పేదరిక జనావళికి
దారిచూపు మార్గదర్శినీ..!

తరతరాల
శృంఖలాలత్రెంచిన
స్వేచ్ఛామతల్లివీ
"తెలంగాణ"ను
ప్రసాదించి ప్రభవించిన
సుఫల జీవని..సుప్రదాయినీ..!
వరప్రదాయినీ అమృతభారతీ!!

–డా.గన్నోజుశ్రీనివాసాచారి
8555899493,

అమ్మే నా ప్రాణం

నా అణువణువులో అమ్మ
అమృతమై నిలిచింది
దీపపు ప్రయాణం
నూనె ఉన్నంత వరకే
ఆ వెలుగుకంటే మిన్న
అమ్మతో నా జీవన ప్రయాణం
ఎన్ని జన్మలకైనా చిరాయువునిస్తుంది.
చందమామ కాంతికి
సూర్యుని వెలుతురుకు
అమ్మయే ఆత్మీయ అద్దం పట్టినట్లు
నా బతుకు బాటకు వెలుగవుతుంది
అమ్మ ఆత్మీయతల అనురాగపు పూదోట
నా మొండితనానికి ధైర్యం పెంచుకొని
అమ్మ పంచిన నమ్మకం,
కర్తవ్యం, పట్టుదల
నా విజయానికి సంకల్ప బలం
అదృష్టమై అందలాన్నిక్కిస్తుంది
నా మనసులో దైవం అమ్మ
అమ్మ మనసులో ప్రేమ
నా ఆకాంక్షల సౌధాలను ముద్దాడి
జన్మాంతం అమ్మకు
అదృష్ట ఆడపిల్లనౌతా!

– బెక్కం ప్రతిభ
సెల్: 9701075552

తొలి పూవు



నేలతల్లి గర్భాన్ని చీల్చుకుని
నేరుగా..
అవనిపై
అడుగిడిన మొక్కను
కంటి పాపలా
కాపాడుకుంటూ.
చంటి పాపలా
చల్లగా చూసుకుంటూ
ఎంచక్కా ఉగ్గుపాలవోలె
ఎరువేసి.. దాన్ని
ఎత్తుకెదిగేలా చేస్తే
అది యవ్వనంలోకి
అరుదెంచగానే..
నవ జీవంతో తొణికిసలాడి
నలుదిశలా పరిమళాలు
వెదజల్లేలా
వింత గొలుపు
తొలి పూవునిచ్చి
తనువెల్ల పులకరింపజేస్తుంది!
ఇంటికి...
ఇట్టే శోభనుకూర్చి మనసును
ఉల్లాసంతో..
ఊరడింపజేస్తుంది!
కవులకు–
కవితలు వ్రాయ ఉసిగొలిపి..
పర్యావరణాన్ని
పదిలంగా ఉంచ
ప్రభావితం చేస్తుంది!!

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

విదేశీయానం

ఖతార్ ప్రయాణం- అనుభవాలు

– గోళ్లమూడి పద్మావతి
సెల్: 9618895543

ఎమిరేట్స్‌కు చెందిన విమానంలో ప్రయాణం. వయా దుబాయి–దుబాయిలో విమానం మారాలి. ఖతార్ చేరుకున్నాను. విమానం ఎక్కగానే, నన్నెక్కువగా ఆకర్షించింది, పర్షియన్ ఎయిర్ హోస్టెస్‌లు కొంతమంది. కొంతమందేమిటి లెండి అందరు ఆకాశంలో విహరించె దేవదూతలేమో అనిపించారు. వాళ్లల్లో కొంత మంది అందమైన బొమ్మలాగే అనిపించారు. మొహాలపై చెరగని చిరునవ్వుతో అందర్నీ పలకరించటం, సహాయం చెయ్యటం చూస్తే, మసులో ఏదన్నా బాదపడుతున్నా, మొహంపై నవ్వులు పులుము కొని, ఉద్యోగ నిర్వహణ చెయ్యాలి కదా అనిపించింది. ఎంత జీతం తీసుకున్నా, వేరే ఉద్యోగస్థులె వరూ వాళ్ల చేసినట్లు విధులు నిర్వర్తించలేరనిపిస్తుంది. వారి సేవాభావం నాకు నచ్చింది.

ఖతార్ ఎయిర్‌పోర్ట్ చూస్తే అబ్బురమనిపించింది. చాలా పెద్దది. బయటకు రావాలంటే చాలా నడవాలి. నడవలేని వాళ్లకు 'ట్రావెలేటర్స్'పైకి మెట్లు ఎక్కలేని వాళ్లకు 'ఎస్కలేటర్స్' ఉంటాయి. హమద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్ట్ రన్‌వే మీంచి నేరుగా సముద్రం మీదనే విమానం ఎగురుతుంది. పక్కనే సముద్రం. అసలు ఖతార్ దేశమే ఒక పెనిన్సులా– మూడు వైపుల సముద్రం, ఒకవైపు భూభాగంతో అనుసంధానం పబడి వుంటుంది. చాలా చిన్నదేశం. కానీ అతి సంపన్న దేశం. కారణం– వాళ్లకున్న పేట్రోల్ (లిక్విడ్ గోల్డ్) నిక్షేపాలు, పెట్రోలు, లిక్విడ్ గాస్ ఎగుమతులు. మన దేశం కూడా గాస్ దిగుమతి చేసుకొంటుంది.

ఆ దేశంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు లేదు. కొన్ని బస్సులు, టాక్సీలు, మాత్రముంటాయి. ముఖ్యంగా బస్సులు వర్కర్స్‌ను వర్క్‌ప్లేస్‌కు చేర్చెవి మనకు రోడ్ల మీద కనిపిస్తాయి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లేకపోవటం వలన రోడ్ల మీద మనకు మనుషులు కనిపించరు. వాహనాలు మాత్రమే కనిపిస్తాయి. మనుషుల్ని చూడాలంటే 'మాల్స్'లోనే. ఇప్పటి వరకు ఆ దేశంలో రైలు లేదు. త్వరలో మెట్రోరైల్ వస్తుంది. పనులు నడుస్తున్నాయి.

బైక్‌లు కూడా చాలా తక్కువ. వేళ్లమీద లెక్కపెట్టవచ్చు అవీ రేస్ బైకులు.

ఖతార్‌లో కొంత భాగం ఎడారి ప్రాంతం– ఇసుక తిన్నెలతో అందంగా వుంటుంది. మరోవైపు అందమైన బీచ్‌లు. వారాంతపు శలవులలో ప్రజలు ఆట విడుపుగా ఎడారి ప్రాంతాలలో 'డెసర్ట్ రైడింగ్' ప్రత్యేకమైన ట్రైవీల్ బైకులు (అద్దెకు ఇస్తారు) పై వెళతారు. లేదా బీచ్‌లకు వెళతారు. ఎడారుల్లో వెళ్లటానికి కార్లు అద్దెకిస్తారు. ఒంటెలమీద తిప్పటం కూడా వుంటుంది. బీజ్‌లవద్ద కాని, పబ్లిక్ ప్లేసులలో కాని, డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి వుంటాయి. బీచ్‌లలో కూడా ఎంతో పరిశుభ్రంగా వుంటుంది. నీళ్లు కూడా స్వచ్ఛంగా వుంటాయి. అంటే ప్రజలు పరిశుభ్రత పాటిస్తారు. పద్ధతిగా జీవిస్తారు. అదొకటి చాలా నచ్చిన విషయం. తప్పక తెలుగు కోవలసిన విషయమేంటంటే అక్కడి జనాభాలో 24% భారతీయులే. అక్కడి నియమ నిబంధనలు చక్కగా పాటిస్తారు. కానీ మన దేశంలో ప్రధాన మంత్రి మోడీగారు స్వచ్ఛభారత్ నినాదంతో పరిశుభ్రత కోసం ఉద్యమించాల్సి వచ్చింది. దానికి కారణం చిత్తశుద్ధి, నిబద్ధత పాలకులలోనే లేకపోవటంతో 'యధారాజా తధాప్రజా' అన్న తీరుగా నడుస్తోందనిపిస్తోంది. మన దేశాన్ని మనం గౌరవించటం లేదనిపిస్తుంది. కాలనీ లేంటి, ఎక్కడికక్కడ పరిశుభ్రత కనిపిస్తుంది. పాటించేవాళ్లల్లో మనవాళ్లూ వున్నారుకదా! మరి మన దేశంలో ఎందుకలా ఉండరు? అనిపిస్తుంది.

ఖతార్ నేలలోలైమ్ ఎక్కువుంటుంది. మొక్కల పెంపకానికి అనువుగా వుండదు. ఇసుక ఎక్కువగా వుండే ప్రాంతాల్లో ఖర్జూరపు చెట్లు బాగా పెరుగుతాయి. చాలా రుచిగా వుంటాయి. పండ్లు ఎగుమతి అవుతాయి. కాలనీలో, రోడ్ల పక్క ఈ చెట్టే కన్పిస్తాయి. రోడ్ల కూడలిలో మంచి మట్టి తెప్పించి, అందరి కోసం పూల మొక్కలను పెంచుతున్నారు. ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో పండ్లమొక్కలు, కూరగాయల మొక్కలు, పంటలు కూడా పండించే ప్రయత్నం మొదలుపెట్టారు. మొక్కలు పెరగటానికవసరమైన మంచి నీరు కూడా లేదు. అయినా దేశాభివృద్ధికి వారి కృషి అభినందనీయము. మన దేశంలో బంగారం వంటి నేల, జీవనదులు కలిగి వుండీ, సరిగా పంటలు పండించ లేకపోవటం దురదృష్టం కదా! సరైన నీటి ప్రణాళికలు లేక వృధాగా నీరు సముద్రం లో కలిసిపోతోంది.

ఆ దేశంలో నదులు, చెరువు లేమీ లేవు సముద్రం తప్ప. ఆ సముద్రపు నీటినే 'డీసాలినేషన్' చేసి గృహావసరాలకు, అన్ని అవసరాలకు వాడతారు. వర్షాలసలు కురవవు. ఎప్పుడో సంవత్సరానికో, రెండు సంవత్సరాల కొకసారొ చిరుజల్లులు పడతాయట. కానీ ఈ మధ్య, నేనక్కడున్నప్పుడు రెండు సార్లు, ఒక మోస్తరు వర్షం పడింది. అంటే అక్కడి వాతావరణంలో కూడా కొద్దిగా మార్పులొస్తున్నాయనుకుంటా!

అయినా ఆదేశంలో దేనికీ కరవు లేదు. కొరత లేదు. దొరకని వస్తువుండదు. చిన్న చిన్న కిరాణాషాపులు, దుకాణాలు కనిపించవు. అన్నీ పెద్ద పెద్ద 'మాల్స్' సూపర్‌మార్కెట్‌లు. సూది దగ్గర నుండి, కూరలు, ఆకుకూరల నుండి ఎలక్ట్రానిక్ పరికరాలు వరకు అన్నీ వాటిల్లోనే దొరుకుతాయి. నీళ్లు పాలు, కూరలు, ఒకటేమిటి అన్నీ దిగుమతి చేసుకోవలసిందే. ఎందుకంటే ఆవులు, గేదెల వంటి జంతువులుండవు. వుంటే వాటి గ్రాసం కూడా దిగుమతి చేసుకోవాలి కదా! పిల్లలు తప్ప, మరే జంతువు కనిపించదు. కుక్కని పెంచుకోవాలంటే పర్మిషన్ తీసుకోవాలి. అన్ని రకాల పండ్లూ, కూరగాయలు, ఏ వస్తువుకూ కొరత వుండదు. పైగా అన్నీ నరనరమైన ధరలలో అందించబడతాయి. అన్నీ సమృద్ధిగా అందునా మంచి క్వాలిటీ సరుకు దొరుకుతుంది. ఆహారమైనా సరే, వస్తువులైనా సరే. 'కాస్ట్ ఆఫ్ లివింగ్' చాలా తక్కువ. అన్నీ సమృద్ధిగా పండే మన దేశంలో మనకు మాత్రం నాణ్యమైన సరుకు దొరకదు (సామాన్యునికి). నాణ్యమైన సరుకు కొనాలంటే చాలా ఖరీదు చెల్లించాలి. ధనవంతులు వ్యాపారవేత్తలు మాత్రమే కొనగలరేమో. ధనవంతులు మరీ ధనవంతులుగా, బీదవాడు మరీ బీదగా వుండటమే చూస్తూంటాం. అంతా డబ్బు మహిమ.

ఖతార్‌లో చాలా విద్యుత్ ప్రాజెక్టులున్నాయి. విద్యుత్‌కు కొరత లేదు. ఇంటి అవసరాలకు వాడుకునే విద్యుత్‌కు డబ్బు వసూలు చెయ్యరు. ఇంటి అద్దె మాత్రం కట్టాలి. అట్లా అని విద్యుత్ అవసరం తక్కువనుకునేరు. ప్రతీ ఇంట్లో చిన్న ఇళ్లైనా, బంగళా అయినా, ఫ్లాట్ అయినా, ప్రతి గదిలో హాలులో ఎ.సిలుంటాయి. ఫాన్లుండవు. గీజర్లు, ఇవన్నీ అమర్చిన ఇళ్లే అద్దెకు దొరుకుతాయి. చాలా వరకు 'ఫర్నిష్‌డ్' ఇళ్లు అద్దెకు ఇస్తారు. ఓవెన్, ఫ్రిజ్, సోఫాసెట్, డైనింగ్ టేబుల్, బెడ్స్ సమస్తం వుంటాయి. కరెంటు పోవటమనే ప్రశ్నే వుండదు. మన దేశంలో నీటి నుండి, గాలి నుండి, బొగ్గుమండి, ఇంకా చెత్త నుండి కూడా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నా, ఎప్పటి కప్పుడు విద్యుత్ యూనిట్ రేటు పెరుగుతున్నా, గృహావసరాలకు, పరిశ్రమలకు, కనీసం వ్యవసాయ రైతులకు కరెంటివ్వలేకపోవటం, రైతుల బలవన్మరణాలకు కారణమవటం చూస్తున్నాం. మనదేశం పెద్దది, జనాభా ఎక్కువ, అవసరాలెక్కువ. దానికి తగ్గట్టు ప్రణాళిక వేసుకొని, ఉత్పత్తి పెంచి, ప్రజావసరాలు తీర్చాలి కదా! అదే కదా సుపరిపాల నంటే! స్వాతంత్ర్యం వస్తే మనని మనం బాగా పరిపాలించుకోవచ్చున్నారు. ఇదేనా పరిపాలన. స్వాతంత్ర్యం స్వార్థపరుల కుహనా రాజకీయాలు, అవకాశవాద రాజకీయాలకు, అవినీతి పాలనకు బలైపోయింది అనిపిస్తుంది.

ఖతార్‌లో రాచరికపాలన ప్రజా పరిపాలనా పద్ధతుల మిళితంగా పరి పాలన సాగుతుంది. రాజు దే తుది నిర్ణయం. వారి రాజధాని 'దోహ'. చాలా చిన్న ప్రాంతం. కానీ ఆకాశ హర్మ్యాలతో, ఎదురుగా సముద్రం. విద్యుత్ దీపాల కాంతిలో రాత్రి పూట చూస్తే, చాలా అందంగా కనిపిస్తుంది. పార్లమెంటు భవనం, వివిధ శాఖలు నిర్వహించే మంత్రులు, వారి కింద విధులు నిర్వహించే అధికారుల కార్యాలయాలు అన్నీ అక్కడే వుంటాయి. ఈ మధ్యనే నగర పాలక సంస్థనూ ఏర్పరచుకొని, ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో ఒక స్త్రీని గెలిపించారు. మొట్టమొదటి స్త్రీ పరిపాలనలో పాత్ర పోషించటం జరిగింది. రాజరిక పాలన కంటే ప్రజాపాలన గొప్పదని భావించి, చాలా దేశాల్లో అదే పాలన సాగుతోంది. రాజ్యాంగంలో చట్టాల్లో వున్న లోపాల కారణంగా ప్రజాప్రతినిధులచే పరిపాలనకు అవినీతి జాడ్యం పట్టింది. అవినీతికి కళ్లెం వేయగలిగితే దేశాభివృద్ధి జరుగుతుంది.

ఖతార్‌లో పరమత సహనము లేదనిపిస్తుంది. అడుగడుక్కీ ప్రతి కాలనీలో వాళ్ల ప్రార్థనల కొరకు ప్రార్థనా మందిరాలుంటాయి. అన్ని దేశాల వారు అన్ని మతాలకు చెందినవారు ఉద్యోగార్థం, పనుల కోసం అక్కడ వుండే వారికి కూడా కనీసం ఒక ప్రార్థనా మందిరముంటే బాగుంటుంది అనిపించింది.

అక్కడ పనిచేయటానికి, స్కిల్డ్ లేబర్, ఉద్యోగస్థులు– అన్నిదేశాల వారూ వుంటారు. ఫిలిప్పీన్స్ ఎక్కువగా మాల్స్‌లో, షాపుల్లో, పిజా సెంటర్లలో పనిచేయటానికి వస్తారు. లేబర్‌లా బాగా లేదని, వారు చాలా కష్టాలు పడుతున్నారని విమర్శలు రావటంతో, ఈ మధ్య 'లేబర్‌లా'లో మార్పులు చేశారట. ఉన్నతమైన పదవులలో ఉద్యోగాలు చేస్తున్న వారికి కూడా వివక్ష నెదుర్కోవటం తప్పటం లేదు. ఆమెరికన్స్, బ్రిటిషర్స్ (తెల్లవాళ్లు)తో పోలిస్తే మన వాళ్లకిచ్చే జీతాలలో తేడావుంటుంది. అక్కడ టాక్స్‌ఫ్రీ మనీ అనీ, నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చని, అప్పులు తీర్చుకోవచ్చని వెళుతుంటారు. ఖతార్ కూడా అభివృద్ధి చెందుతున్నదేశం. ఇంకా చాలా అభివృద్ధి చెందాలి. అక్కడి పరిస్థితులు కూడా మారి అందరూ ఆనందంగా ఉండగలుగుతారని, అలాంటి మార్పులు తప్పక వస్తాయి. వారు వాళ్ల దేశాన్ని అభివృద్ధి చేసుకోవటంలో అందరి సహాయ సహకారాలవసరమని గుర్తించారు కనుక త్వరలోనే మంచి మార్పులు వస్తాయని ఆశిస్తున్నా.

ఆ దేశ పౌరులకు సకల సౌకర్యాలు అందుబాటులో వుంటాయి.పిల్లలకు ఉచిత విద్య వయోజనులకు రాయితీలు కల్పించారు. అమెరికాలో లాగా కొన్నేళ్లపాటు అక్కడే నివసిస్తే కూడాపౌరసత్వం రాదు.

ఖతార్ చాలా చిన్న దేశమైనా, అభివృద్ధి చెందుతున్న దేశం. అన్నీ ప్లాన్డ్‌గా జరుగుతాయి. అక్కడ చూడవలసిన ప్రదేశాల్లో ముఖ్యమైనది కాపిటల్ 'దోహ'లోని 'కార్నిష్' ఏరియా– ఆకాశ హర్మ్యాయలతో, ప్రక్కనే సముద్రం– బోట్‌షైర్ చాలా బాగుంటుంది. దానికి దగ్గరలోని 'ఏఫీ ఖతార్' సముద్రం మీదికి విస్తరించి నిర్మించిన ప్రాంతం. అందులో విల్లాలు, ఫ్లాట్‌లు అత్యంత ఖరీదైనవి.

అక్కడకు దగ్గరలోనే ఉన్న చూడవలసిన మరో ప్రదేశం 'కతారా' విలేజ్. అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకొనేందుకు పెద్ద 'ఎఫిథియేటర్' వుంది. ఇది ఓపెన్ థియేటర్. అక్కడే పెద్ద ఆడిటోరియం కూడా వుంది. ఈ సంవత్సరం ఉగాదికి రెండు రోజుల ముందు 'ఇండియన్ ఫెస్టివల్' నిర్వహించారు. పోయిన సంవత్సరం నుంచే ఇలా నిర్వహించటం మొదలు పెట్టారట. స్కూలు పిల్లలు ఆ కార్యక్రమాల్లో మన సంస్కృతీ, సాంప్రదాయ నృత్యాలు చేసి అలరించారు. మరో విశేషమేంటంటే ఆదేశం పిల్లలు కూడా ఆ కార్యక్రమంలో పాల్గొనటం.

కార్నిష్‌కు, దగ్గరలోనే 'సుక్' వుంటుంది. అతి పురాతన కట్టడాలను జాగ్రత్తగా మరమ్మత్తులు చేసి. హెరిటేజ్‌ను కాపాడుతున్న పెద్ద మార్కెట్ ఏరియా. మన బేగంబజార్, చార్మినార్, జనరల్ బజార్‌లాగా అన్ని వస్తువులు దొరికేషా పులుం టాయి. బంగారం షాపుల్లోని నగలు చూస్తే, కళ్లు చెదిరిపో తాయి. అక్కడ బంగారం నాణ్యతకు పేరు. రేటులో కూడా తేడా వుంటుందని అంటారు. అక్కడ ఇంటర్నేషనల్ స్కూల్స్, విశ్వ విద్యాలయాలు వున్నాయి. లిటరసీరేట్ 85%. 2022లో జరిగే ఫుట్‌బాల్ మాచ్‌లు అక్కడే జరుగుతాయం. వారు ఆతిథ్యమి స్తున్నారు. అందువల్ల త్వరత్వరగా నవీకరణ, సుందరీకరణ పనులు, స్టేడియంలు నిర్మాణాలు జరుగుతున్నాయి. దేశాభివృద్ధికి వారి కార్యదీక్ష నచ్చింది.

ప్రముఖ రచయిత్రి గొళ్ళమూడి పద్మావతి ఇటీవల ఖతార్ వెళ్ళినపుడు ఆ ప్రాంతం గురించి తన అనుభవాలను నేటినిజం పాఠకుల కోసం... –సంపాదకులు







అమ్మే! దైవం

నా కంటి హృదయంలో
నీ కనుపాప చూపై
మనసు మందిరంలో
అమ్మ శిల్పం నిలువెత్తు
నా అక్షర నీరాజనంతో హారతిపట్టి
అమ్మే దైవమనీ
చిన్నప్పుడే నాన్నను కోల్పోయి
నా అశ్రయాల తీరానికి
అమ్మే వారధిలా అనుక్షణం
కష్టాల కడగండ్లను దాటుతూ
నీ ఉన్నతిగా జ్యోతిలా వెలుగుతున్న
అమ్మ! నా జీవితమనే పుష్పం
నీ పాదాల దగ్గర నిత్యం పరిమళమై
వెదజల్లుతుంది.

– లావణ్య
సెల్:970 1075502

ఓటు–నా వజ్రాయుధం

ఓటుహక్కు నీ చేతిలొ ఉందని ననువ్వూ నువ్వని వస్తారు
పదవిని ఎక్కిన పదిరోజుల్లో నువ్వెవరని నిన్నంటారు
నోటుకు అమ్ముడుపోబోకు– ప్యాకెట్ మత్తులో పడబోకు
మత్తుల నీవు పడిపోతే– చిత్తయిపోదువు గమనించు.

అర్ధరాతిని చీకటిలో ఆడది నడిచే రోజు రావాలని
కలలే కన్న గాంధీకి తెలియదు పాపం..
పగలే నడవలేని దుస్థితి మారదని!
నేటి బాలలూ రేపటి పౌరులు మద్యం మత్తులో కూరుకుపోయి
సిగరెట్ పొగలో కమ్ముకుపోయె..!
పల్లెటూళ్లలో అన్నదాతలు ఊళ్లని వదిలి
పట్నం వచ్చిరక్షాలాగే దుస్థితి వచ్చె
"ఇదేనా నా భారతదేశం– గాంధీ కలలే కన్న స్వరాజ్యం"
చెత్తబుట్టలో శిశువులుకొందరు
వీధిబాలలై రేపటి పౌరులు
పట్టాలున్నా కొలువులు లేక నిరుత్సాహమై నిరుద్యోగులు
కొలువులు ఉన్నా– భద్రత లేని సిఐఎస్ ఉద్యోగులు
ఇదేనా, నా భారత దేశం, గాంధీ కలలే కన్న స్వరాజ్యం
దేశపు స్థితిని చూసినవాళ్లు తృప్తిగ మేము ఉన్నామంటూ
చెప్పిన వాళ్లు ఉన్నారా 130కోట్ల జనంలోన

ఈ దుస్థితి సరిచేసేటి మన తలరాతలు మార్చేటి
ఉన్నారా! ఉన్నారా! నాయకులెవరైనా ఉన్నారా!
వుంటే వెళ్దాం..మనమంతా– మీకే మా ఓటంటూ
మన తలరాతలు మార్చుమంటూ..

– ప్రసన్న లక్ష్మి కులకర్ణి
సెల్: 9492564684

మరో విచిత్రం

ఈ మధ్య అభిమానులు
తమ అభిమానాన్ని చాటుకోవడానికి
తమ నాయకుల ఫోటోలకు
పాలాభిషేకం చేస్తున్నారు.

చిత్రపటాలకు
క్షీరాభిషేకమేమిటి?
విచిత్రం కాకపోతే.

అలా పాలు నేలపాలు
చేయడమెందుకు?
వారి పేరుమీద
పేదలకో, రోగులకో పంచండి
పుణ్యం, పురుషార్థం!

అంతగా చేయాలంటే
జాలాభిషేకాలు, పూలాభిషేకాలు
కనకాభిషేకాలు చేయండి..
నష్టమేమీ లేదు!

– వి. మంగతాయారు
సెల్: 9949278483

గజల్

చెట్టుమీదపండునెవరుకాయమంటుచెప్పింది
పుట్టలాగ మట్టి నెవరు దాయమంటు చెప్పింది.

దీనుల కష్టాలను కన్నీటిని తొలిగించగా
అద్భుతమోహనమెవరురాయమంటుచెప్పింది.

బీదలంత వీడకనేబ్రతికినన్ని రోజులును
బాధలున్నకావిడెవరుమోయమంటుచెప్పింది.

చెట్టుకున్న వేర్ల నోర్లు చిగురించగ చూసుటకు
గుట్టుగాను నీటినెవరు పోయమంటు చెప్పింది.

కంటిపైన కమ్ముకున్న పొరలన్నియు వేగంగ
పొరబాటునువీడకుండతీయమంటుచెప్పింది

కోకిలమ్మ పాటలన్ని లోకులకే నేర్పితా
అందరినే తనలాగే కూయమంటు చెప్పింది.

అమ్మమాట నిండుగాను ఎల్లవేళ దాగుండు
గుండెలోకి ప్రేమంతా తోయమంటు చెప్పింది.

మంచితోడు స్నేహిస్తూ మనషులతో పగబూనె
చెడ్డవారిచెలిమినెపుడుపాయమంటుచెప్పంది.

శ్రీదేవిగ పాడుకున్న పాటలయలు పొంగించి
అమృతోటిబంధమెవరువేయమంటుచెప్పింది

–సముద్రాల శ్రీదేవి
9949837743

ఆధునిక రాజకీయం

నీతిని తివాచీగా పరిచి,
దానిని నిర్దాక్షిణ్యంగా త్రొక్కుతూ
దర్జాగా నడిచివెళ్తూ
అవినీతిని రారాజుగ చేసి
పెద్దపీట వేసి గౌరవిస్తూండడం
ఆధునిక రాజకీయం!

కపట ప్రేమా, భక్తీ

కపట ప్రేమా, భక్తీ
అతిగా ఉప్పొంగి ప్రవహిస్తూ
కుటుంబ ఆనకట్టలు తెగిపోతూ
అభివృద్ధి చేసిన వృద్ధతల్లిదండ్రులూ
దీనస్థితిలోని పెద్దలూ
వృద్ధ (అనాథ) ఆశ్రమాలకు
కొట్టుకుని పోతున్నారు!

– రఘువర్మ
సెల్: 9290093933

మార్గదర్శకులు

జీవితంలో కొన్ని విలువైనవి.. అత్యంత విశిష్టమైనవి వుంటాయి
అమ్మ చెప్పిన మాట.. నాన్న చూపిన బాట..
వాటిని ఎప్పుడూ దూరం చేసుకోకూడదు.. విడనాడకూడదు!
అమ్మ చెప్పే మంచి మాటలు రేపటి ఉజ్వల భవిష్యత్‌కి మార్గదర్శకాలు
నాన్న చూపిన బాట..

ప్రపంచానికి నిన్ను పరిచయం చేసే స్ఫూర్తివంతమైన
తొలి అడుగుల గమనానికి శ్రీకారం..
నిన్ను నిన్నుగా నిలబెట్టే నీ విజయానికి పథ నిర్దేశికాలు..
ఆశయ సాధనలో
ఎదురయ్యే ఎలాంటి ఇబ్బందులనైనా.. కష్టాలనైనా..
ఎదుర్కొనగలిగే ఆత్మస్థయిర్యాన్ని
కోరుకున్నది సాధించాలన్న పట్టుదల.
నీలో..
కలిగించి.. రగిలించి.. రవళించేలా చేస్తాయి.. వారి దీవెనలు!
అమ్మ నాన్నలు..
పంచిన ప్రేమ ఆప్యాయతలు.. మమతానురాగాల మరోరూపం
వారు చెప్పిన మాటలు.. చూపిన బాటలు.
అవి జీవితంలో సదా విలువైనవి విశిష్టమైనవి..
అవే
నీ అభ్యున్నతికి కారకాలు!

– జి. శ్రీను
సెల్:9652832290

జ్ఞాపకాలు

జ్ఞాపకాల కాగితాలు
గుట్టలా పోసుకున్నాను
ఏరిపారేద్దామనుకుంటూ
ఒక్కొక్క కాగితం చదువుతున్నకొద్దీ
అనుభవాల పరిసరాలు
ఇప్పుడే జరుగుతున్నాయా
అన్నంత కొత్తగా ఉన్నాయి
ఎంత ఏరుతున్నా ఎంతగా
తరచి తరచి చూసుకొన్నా
ఏమున్నదీ జ్ఞాపకాల కాగితాల్లో
అన్నింటి నిండా కన్నీటిచారలే
గుండెని గాయం చేస్తూ
మకిలి మకిలిగా మురికి పట్టి ఉన్నాయి
కొన్నింటికి రక్తపు చారలు కూడా
తుడిపేద్దామనుకొన్నాను
అవి ఆరి ఎర్రటి రంగులా
బట్టమీద అద్దకంలా అంటి పెట్టుకొన్నాయి.
విందు విందు అయిన కాగితాల్లో
ఒకటో రెండో నన్ను హాయి అని
పలుకరించాయి
ఎండిన భూమ్మీద వానచినుకుల్లా
అవే అవే నా ప్రేమ గుర్తులు
ఎప్పుడు చదివినా
వాటినే చదువుకుంటాను
ఎప్పుడు జ్ఞాపకం చేసుకొన్నా
వాటినే
జ్ఞాపకం చేసుకుంటాను
అవి కూడా మాసిపోతున్నాయి
గుండె అడుగు పొరల్లోకి
జారి సమాధి అయిపోతున్నాయి
వెళ్లిపోతున్న కాలంతో పాటూ
మరుగునపడిపోతున్నాయి
అయినా అప్పు డప్పుడిలా
నా జ్ఞాపకాల కాగితాల్నీ
గుట్టలా పోసుకుంటూ
ఏరుకూంటూ ఉంటాను.

– ఎ. రేణుక
ఫోన్: 27158943

జీవనయానం

ఒక బరువు ఎత్తు కుంటూ ..
ఒక బరువు దించుకుంటూ..
సాగించే జీవిత ప్రయాణంలో
ఎవరికి ఎవరు..?
ఎవరికి వారే....! అయినా
ఏదో ఒక సమయంలో
అంతా పరాధీన పర్వ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 324వ రోజు 'అక్షరం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'అక్షరం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

– సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

అక్షరమే నా శ్వాస

మనిషి మనుగడకు ప్రాణం
ప్రగతి బాటకు వరం
జీవన గమనంలో తోడు
వెలుగు జిలుగుల సైదోడు
అక్షరం అందరికీ ఆయువుపట్టు!.
ఆనందంలో
మదిలో ఎగిరే భావాలకు ఆకృతి
ఆవేదనలో సేద తీర్చి లాలించే అమ్మ
ధైర్యం నూరిపోసే నాన్న
చెంతకు చేరదీసి స్నేహితం చేసి
మనసుకు ఊరటనిచ్చే అక్షరం
నాకు చైతన్య కిరణం!!.
మనసులోనే కొట్టుమిట్టాడే భావాలు
బయట చెప్పలేనివి
లోలోన నాలో నేనే
అక్షరాలతో మాట్లాడుకుంటూ
ఆవేశాన్ని అదిమిపడుతూ
బాధను దిగమింగి నాకు నేనే
అక్షరాలతో దోస్తీ
ఓదార్పునిస్తూ
వెన్నెల చల్లదనం కలిగిస్తూ
తడుపుతుంది ఎద!!
ఎగిసిపడే భావతరంగాలకు
నవరసభరితమైన మాట
ఆలోచనకు వెలుగు బాట
అంతేవాసులకు ముత్యాల మూట!!
అక్షరమే ఆధారం
ఆయుధం ఆరాధ్యం
ఆరాటం ఆవేశం
ఆవేదన నివేదన
ఆనందం ఆహ్లాదం
చైతన్యం ప్రోత్సాహం
నా ఉనికి ఊపిరి
అక్షరమే శ్వాస ధ్యాస!!.
ఊపిరున్నంతవరకే కాక
చిరంజీవిగా ఉంచే
శాశ్వతంగా నిలిచే అక్షరం
చీకటిలో చిరుదీపం
జీవన గమనానికి
కాంతిపుంజం!!.

–డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

అక్షరమా వందనం

పదాలు ఎదలో మెదులుతూంటే
కలంతో వాటిని సమం చేస్తూ
అక్షర మాలలెన్నో అల్లేస్తూ
అక్షర సంపదను
అందరికీ పంచాలని
మెదడుకు శ్రమ కల్గిస్తూ
ఎడద కవాటాలను దాటి
కవాతు చేసే అక్షర సైనికురాలిని.
ఒక్కో అక్షరం
సిరా సముద్రంలో
స్నానమాడుతూ
పాళీతో ముత్యాల
అక్షరాలతో పడివడిగా
కాగితంపై దూకేస్తూ
వినూత్న ఒరవడులనెన్నో సృష్టిస్తూ.
పదునెక్కిన ఆయుధమై
చీకటి చీల్చే వెలుగు రేఖయై
దశ-దిశని నిర్దేశించే
అక్షరాల సంగమం
భావాల సమ్మిళితం.
అందుకోలేని అగాధంలో ఉన్నా
సప్త సముద్రాల ఆవల ఉన్నా
అందమైన అక్షరాలతో
మాటల మాలలు కట్టి
పరిమళాలు వెదజల్లే కుసుమాక్షరాలై
మర్చిపోలేని జ్ఞాపకమై
భాషలోని మాధుర్యమై
కవిలోని సామర్థ్యంతో కలిస్తే
అద్భుతాల అక్షరమే
చదివితే అమృతమే
హాయినిచ్చేది అక్షరమే
అక్షరమా!
నీకు వందనం!.

– పురం మంగ

అణగారిన వర్గాల పక్షం

అవును !
అక్షరం అణగారిన వర్గాల పక్షం
మమేకమైన నిత్యాక్షర పోరాటం !
ఆకాశహర్మ్యాల నీడలో
అక్షరం ఇమడదు...
అందమైన విల్లాల ఈతకొలను
వైపు కన్నెత్తి చూడదు !.
చరిత్ర తిరగరాసే
జ్వలిత కలంలో
ఆసహాయ,బడుగు జీవుల
తొలి కబళం పైనే అక్షరం కన్ను!
అందిందా లేదా... తపనతో !
క్షుధార్తినే సిరాగా
కలం మొదటి అక్షరం రాస్తూ...
సమైక్య రాగాల కచేరికి
తోడి రాగం ఆలపిస్తుంది !.
అధికారం అకృత్య రాక్షసికి
మొదటి నిరసన అక్షరానిదే !
అంతరాత్మను స్వేచ్ఛ గా విడిచి
ఏ కమ్మరి కొలిమితిత్తి దగ్గరనో
సేద దీరి
రేవులో దబ్బ దబ్బ చప్పుడులో
ఆరేసిన బట్టల ఇంద్రధనుసుకు
ముచ్చట పడుతుంది,చవుడు
మనసుల గురించి ఆలోచించి...
బీడీ ఆకుల బుట్టలో
లలితమైన స్పర్శకు
పులకించిపోయి
ఘాటుకు
పేదరికం వేటుకూ
కన్నీరు కార్చిన అక్షరం !.
ఉభయ సంధ్యల సైకిల్ సూరీడు
గీత కార్మికుడి మోకు
బలం పరీక్షచేసి
పొద్దు పొద్దున్నే
జాలరి మహిళల నుదుట సింధూరమై
అక్షరం వేటకి తానూ సిద్ధంగా.
మిత్రుల సమావేశపు హాయి
అద్దాలపెట్టెలో బన్ను
రసూల్ భాయ్ ఛాయ్ !
ఆత్మీయ సంచారి అక్షరం !!.

–ఎం. వి. ఉమాదేవి

ఉపాధి మార్గం

కం. అక్షరములునాబ్రతుకుకు
భిక్షమునిడెనక్షయముగ విద్యల వెలుగుల్
సాక్షిగ సంస్కారమ్మున
నీ క్షితిలో గురువు రూప మెన్నిక చేయన్!!.

ఉ. నేడు ప్రపంచమక్షరము నేతగ నేలుచుభాషలన్నిటన్
మేలుగభారతీయతను మింటియశమ్మునతారరీతిగన్
చాలిన శక్తి సంపదలు శాస్త్రవిచారముశారదాంబతో
లాలనజేసిగాచుభువిలక్ష్యముసిద్ధికికీలకమ్మునై!!.

ఉ. అక్షరమే విశేషసంపదలకాశ్రయమై భువి నేలునెప్పుడున్
లక్షణ సారమున్ననవిలాస్యములాడునుజిహ్వ భోగమై
రక్షణ విశ్వమేలు ధనరాసులసత్యమునక్షయమ్మునై
కుక్షియుపాధి మార్గమగు కోవిదులై వెలుగొంద జేయుచున్!.

తే.గీ. అక్ష రాస్యత స్వార్థము నహమునున్న
దక్షులైననుచెడగొట్టుత్యాగిహీన
గుణము నాశము జేయును కుత్సితమ్ము
భిక్ష మెత్తిన క్షుత్తును విడువకుండ!!.

– మాడుగుల నారాయణ మూర్తి

అక్షరమే ఆయుధం

సామాన్యుడి అమ్ముల పొదిలో
అసామాన్య శరాలై
బీదవాని దీన గొంతులో
గంభీర స్వర భూషణాలై
అంధకార జీవనంలో
అనంత ప్రకాశాలై
అజ్ఞాన మేఘాలను చీల్చే
పదునైన కరవాలాలై
విశ్వమంతు ఉజ్వలంగా ప్రకాశిస్తున్నాయి.
అక్షరాలే జ్ఞాన భాస్కురులై
అపార జ్ఞానమును పంచే
అక్షయ భాండాగారములై
చిన్నా, పెద్దా, రాజూ, పేద
తారతమ్యం లేక
అందరికీ ఆదరువయ్యే
అఖండ శక్తిప్రదాతలై
అవని లోన విరాజిల్లుతున్నాయి
అక్షరాలే అజేయ ఆయుధాలై.

– సౌదరి మోహన్ గౌడ్

సాక్షరతా బలగం

అక్షర పూల మొక్కకు
పదకుసుమం వికసించింది
వాక్యాల తీగలల్లుకుని
కవన వనం విహరించింది.
ఆరుద్ర వర్ణ సిరాయై
తప్పొప్పులను సరిచేసింది
నీలి వర్ణాక్షరాలతో
కలిమియై చెలిమి చేసింది.
అక్షరమే వెన్నుముకయై
నిఖార్సుగా నిలబెట్టింది
కలమే పదునైన కత్తిగా
అన్యాయాలను అరికట్టింది.
అక్షరాలతో దోస్తీ చెయ్యి
జీవితాంతం తోడుగుంటది
అక్షరం ప్రాణంగ జీవించు
కీర్తి శిఖరమే చేరుస్తది.
అక్షరాలతో కుస్తీ పట్టు
మేధో బలం పెరుగుదలకు
అక్షరాన్ని లాంతరుగ చేస్కో
జీవనయానంలో దారిచూపేందుకు.
అక్షర శరాన్ని ఎక్కుపెట్టు
అఘాయిత్యాలు ఆపేందుకు
అక్షర యజ్ఞాలు చేయాలి
అవినీతిని అంతం చేసేందుకు.

– పి. విజయ రాఖి

నీ వైనా చెప్పు

అ ఆ లు అసలుకే రావు
ఏ బి సి డి లు ఎవ్వరూ చెప్పరు
పుస్తకం ఏమని చదవాలి
ముచ్చటగా మూడేళ్లు నిండే
కరోనా! అంటారు,
కదలొద్దు, మెదలొద్దు అంటారు
ఎన్ని రోజులు
బడికి పోకుండా వుండడం?
యింట్లోనే యిట్లా
ఈడ్చుకుంటు రావడం
మా బాధ ఎవరికి చెప్పుకొనేది
అక్షరం రాక
ఆకారం లేక
ఎవ్వరికి పట్టని బిడ్డల మయ్యాము
చదువుకుంటే చాక్లెట్లు యిస్తారట
పుస్తకాలిచ్చి స్కూల్లో కూచుండ నిస్తారట
పెద్దవాళ్ళమై ఉద్యోగం చేస్తామట
నేను బడికి పోయేది ఎప్పుడు?
నేను బాగా చదువుకునేది ఎప్పుడు?
వాల్లిచ్చే చాక్లెట్లు తినేది ఎప్పుడు?
పెద్ద ఉద్యోగం చేసేది ఎప్పుడు?
అక్షరం రాకుంటే అన్ని వేస్టేనట
అన్నేమో ఆన్ లైన్లో చదువు
ఎప్పుడు లాప్ టాప్ లోనే తలకాయ
మొహం బాగాలేనోడు
అద్దంలో చూసినట్టు
దగ్గరకు రానీడు
ముట్టుకో నీడు
కయ్యి మని లేస్తాడు– కసురుకుంటాడు
ఈ మధ్యనే బడులు తెరిచారు
అక్కా! అక్షరమా ! నీవైనా చెప్పు
మా చదువులు
ఇప్పుడైనా సాఫీగా సాగేనా!.

–కందుకూరి మనోహర్

సైనిక బలం

క్షరము కానిదే అక్షరం
నిరక్షరాస్యత కది
నిర్మూలనాయుధం
కాపాడే సైనిక బలం.
నిరక్షర కుక్షికి
అక్షరం ముక్కలిడిన
ఆ అక్షరమే సంపదై
కాపాడే సైనిక బలం.
చోరులెత్తుకెళ్ళలేరు
చరాస్థివలె తరిగి పోదు
ఋ,ఱ లు కనుమరుగైనా
కాపాడే సైనిక బలం

భాషా పనిముట్లు
సందేశాలకు సూత్రధారులు
జీవితానికి ఊతాలు
కాపాడే సైనిక బలం.

– ఉండవిల్లి సుజాతా మూర్తి

సంపూర్ణ జ్ఞాన సముపార్జన

అజ్ఞానాంధకారాన్ని తొలగించి
జ్ఞాన వెలుగులను
ప్రసాదిస్తుంది అక్షరం
నాశనం లేనిది కదా
దివ్యజ్యోతిని వెలిగిస్తుంది
అక్షర జ్ఞానం సంపూర్ణ
విజ్ఞానాన్ని అందించాలి
మూడనమ్మకాలను తొలగించాలి
శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించాలి
అంతరాలను తగ్గించాలి
వర్గ దోపిడిని నివారించాలి
అతి జ్ఞాన సంపద
వినాశనానికి దారితీయరాదు
విద్వంసాలు సృష్టించరాదు
లోక కళ్యాణానికే ఉపయోగపడాలి
పంచిన కొద్దీ పెరిగేది విద్య
పంచిన కొద్ది తరిగేది ధనం
ధనం అశాశ్వతం
విద్య శాశ్వతం
దొరలు దోచుకోలేరు
దొంగలెత్తుక పోలేరు
పకృతివైపరిత్యాలు సైతం
ఆర్జించిన విద్యనేమి చేయలేవు
సక్రమ మార్గంలోనే
వినియోగించాలి
మిడిమిడి జ్ఞానం
అనర్థాలకు మూలం.
పడ్ పడ్కర్ ఫాగల్ బన్గయా
న పడ్కర్ నావాబు బన్గయా
చదువు సంస్కారంతో పాటు
ఉపాధి అవకాశాలను కల్పించాలి
అందరు చదవాలి
అందరు ఎదగాలి
అంతరాలు తగ్గాలి
ఉపాధి అందరికి దొరకాలి
అందరు హాయిగా బతకాలి
ఉపాధి ఆధారిత
విద్యా విధానం కోసం
అందరం గొంతులు కలపాలి
అక్షరాస్యత అంటే
సంపూర్ణ జ్ఞాన సముపార్జనే.

–గుండం మోహన్ రెడ్డి

అక్షరాస్యత!

అక్షయం అయిన అక్షరం
రాసి వాసిలో మేల్బంతి కావాలి
నిరక్షరకుక్షి!
పొట్టపొడిస్తే అక్షరంముక్క రాదు!
అన్నంచొరవేకానీ అక్షరం చొరవలేదు!
ఒకప్పటి సామెతలు!.
మస్తిష్కంలో పుట్టిన
నోటితో ఉచ్చరించే
పలకపై నర్తించే
వాగ్దేవి అక్షయమాల మణులు!
వేదాలనాదాలు!
వ్యాసుని కథనం
గణనాధుని ఘంటం
అ నుండి ఱ వరకు
గంగలో విరిసిన కమలాలు!.
చదవటం రాయటం వినటం
అక్షరాస్యత కి సోపానాలు!
తెలుగు మాట భాష అక్షరం
పడుతోంది ప్రమాదంలో!?

అందరూ అక్షరంనేర్వాలంటే
చదివి రాయాలంటే
సమిష్టి కృషి
జిజ్ఞాస,తపన కావాలి!
నేర్పేవారికి
నేర్చుకునే వారికి
సయోధ్య సత్సంబంధం ఉంటే
ఇది సాధ్యం!
తెలుగు సొగసు భాషా చమక్కులు
అవుతాయి
వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్లలు!
అక్షరాల పూదండలు!.

–ఎ.రాజ్యశ్రీ

తెలంగాణ వైతాళికుడు

తెలంగాణ చెరువు తీరు!
అతను అలుగు దుంకి పారు!
జయశంకర్ గారిలో,
పదునైన మాటల జోరు!!

ఆలోచనలో బుద్ధుడు!
నియమాలలో నిబద్ధుడు!
తెలంగాణ సాధనకై,
పోరాటాలు చేశాడు!!

ఆవేశంలో రుద్రుడు!
శక్తిలో వీరభద్రుడు!
తెలంగాణ కోసము,
పోరు సల్పిన యోధుడు!!

మృదువైన వ్యక్తిత్వము!
అతనిది మృదుభాషణము!
ఉద్యమాల స్ఫూర్తి కలిగి,
సాగించెను జీవితము!!

ధర్మమార్గమున నడిచెను!
ఉద్యమాలెన్నో చేసెను!
తెలంగాణ విముక్తి కై,
ప్రతి నిత్యం పోరాడెను!!

–బీరప్పొల్ల అనంతయ్య
9686546622

తెలంగాణ జాతిపిత

తెలంగాణ సిద్ధాంతివి
బహుభాషా కోవిదుడివి
తెలంగాణ ఉద్యమాన్ని
ఊపిరోసిన వీరుడివి!

తెలంగాణ సాధనను
మదిలోన కాంక్షించెను
తెలంగాణ వాదంను
బలంగా వినిపించెను!

కె.సి.ఆర్.కు సలహాలను
రాజకీయ విధంబును
వెన్నంటి ఉండి, మార్గ
నిర్దేశమును చేసెను!

తెలంగాణ తేజమా
అరుణకాంతి కిరణమా
రచనలు, ప్రబోధనలతో
స్ఫూర్తినిచ్చి(న) దీపమా!

"ప్రొఫెసర్ జయశంకరము"
మీ త్యాగము మరువము
""తెలంగాణ జాతిపిత""
ఎల్లవేళల తలచెదము!

–ప్రతిభా భారతి
8555057877

పోరు పొద్దు

అన్యాయము పాడి కాదని
ఆక్రందనలు చేసేడి ప్రజల
ఆర్తనాదాలు వినని పాలకుల
ప్రజల ఆర్తి తీర్చా
పాలకుల పాపమనచ
పాపనుడు జయ శంకరుడు
జయ బావుట చేతబూని
తెలంగాణ వీధులందు
పోరాట పాఠాలు నేర్పిన
ఉద్యమ ఉపాధ్యాయుడు
నీతి నిజాయితీ ఆయుధాలుగా
నికరంగా నిలబడిన నిబద్ధుడు
నిర్బంధాలను ఎదిరించిన ధీరుడు
రోడ్లను రణరంగం చేసిన యోధుడు
ఉద్యమ నాయకులను తీర్చిదిద్ది
పోరాటాకి వీరతిలకం దిద్దిన శౌరతడు
ఆర్థిక శాఖ లెక్కలు తీసి
నీతి లేని నీటి పంపకాలు చూసి
నియామకాలలో ఆక్రమణ చూసి
అక్షరా శరాలను వ్యాసాలుగా మలచి
ఆంధ్రా పాలకుల అడ్రగానమనచ
ఆరాటమంత పోరాటమై
తెలంగాణ పోరు పొద్దువై

ఆ వేదిక ఈ వేదిక లెక్కచేయక
స్వరాష్ట్రసాధనాదీక్షబూని
నిర్విరామ కృషిసల్పిన ఉద్యమ రథ సారథి
కోట్లాది తెలంగాణ ప్రజల గుండె చప్పుడు
జయ శంకరా నీకు జయము జయము.

కొత్తపల్లి జయశంకరుడికొంగ్రొత్త
ఆలోచనలు ఎందరికో స్ఫూర్తి
మరెందరికో మార్గదర్శకం
జయశంకరానీకు జయముజయము.

తెలంగాణ సాధనే శ్వాసగాధ్యాసగా
వ్యూహరచనలో అపరచాణక్యుడైన
తెలంగాణ సిద్ధాంత కర్త
జయశంకరా నీకు జయము జయము.

విద్యార్థి లోకం మరువదు మీ బోధన
మీ నామమే మాకు తారక మంత్రం
తెలంగాణ కీర్తిస్తుంది మీ త్యాగ నిరతిని
జయశంకరా నీకు జయము జయము.

విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకించి
తెలంగాణ వాణిని వినిపించిన భాషాప్రవక్త
మన తెలంగాణ కీర్తికిరీటం
జయశంకరా నీకు జయము జయము.

ఇడ్లీ సాంబార్ గోబ్యాక్ అంటూ
దశాబ్దాల బానిసత్వ విముక్తికై
ఉద్యమించిన ఉద్యమ కెరటం
జయశంకరా నీకు జయము జయము.

తొలిదశలోమలిదశలోఉద్యమానికి
ఊపిరిపోసినయాసనీవుభాషనీవు
తెలంగాణ ఉద్యమ బాట నీవు
జయ శంకరా నీకు జయము జయము.

ప్రాంతీయఅసమానతలపైధ్వజమెత్తి
నవ తెలంగాణకునాందిపలికిన
అలుపెరుగని పోరాట యోధుడు
జయశంకరా నీకు జయము జయము

–వల్లంభట్ల పనజ
8333037850

లెట్స్ అనక రైట్ అనక
ప్రత్యేక తెలంగాణ సాధనకై
ప్రతి వేదిక నెక్కి ప్రసంగించిన
తెలంగాణ పితామహా జయశంకర
నీ యశోకాంతి తెలంగాణమంతా
వెదజల్లిన ఓ యశో మూర్తి

ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ మొదలు
జీవిత పర్యంతం వరకు
సాగిన నీ పోరాట పథం
అజరామరం నీ జీవిత పాఠం
జయహో జయ శంకరా జయహో

–డా.ఎడ్ల కల్లేశ్
9866765126

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

క్షరం లేని అక్షరం

ప్రథమ
బహుమతి విజేత

అక్షరమంటే మరణం లేని కిరణం
అజ్ఞానాంధకారాన్ని తొలిగించే జ్ఞాన దీపం
విజ్ఞాన సుధలను అందించే భాండాగారం
అక్షరాన్ని నేర్చాకే మనిషి మనీషి అయ్యింది
అంతరిక్షానికి నిచ్చెన వేసి
రహస్యాల శోధన చేసింది..
అంతుచిక్కని అగాధాల
ఆనుపానులను తెలుసుకుని
భూమ్యాకాశాల నడుమ
విజ్ఞాన తారై కాంతులు వెదజల్లింది...
చరిత చాళ్ళలో ఇంకిన
గత కాలపు ఆనవాళ్లను
తరాలకు ప్రేమగా అందించింది!
ఉద్యమాలకు ఊపిరి పోసి
హక్కులకై నినదించే
ప్రజా గొంతుక నిచ్చింది...
అమ్మా అని దరిచేరితే
దీవించి వృత్తి భిక్ష పెట్టింది..
సమస్త మానవాళి
అక్షరాల వెలుగులోనే
భవిష్యత్తుకు బాటలు వేసుకునేది..
అక్షరమే మనసుకు
సాంత్వన ఇచ్చే నేస్తం
అక్షరమే అవినీతిపై తిరగబడే
విప్లవం
క్షరం కాని అక్షరంతో చేసిన దోస్తీతో
మనమూ అవుతాం
అజరామరం!

–పురిమళ్ల సునంద
9441815722

క్షరం కాని అక్షరం

ద్వితీయ
బహుమతి విజేత

అక్షరం తరతరాలుగా మన ఆచారం
తనలో ఉంటుంది మధురమైన భావం
అక్షరం సరస్వతీ దేవి అనుగ్రహం
పెంచుతుంది మన జ్ఞానం
అక్షరం మనం చూసే
కొత్త విషయాలకు కారణం
దూరం చేస్తుంది మూర్ఖత్వం
అక్షరం భాష యొక్క అర్థాన్ని తెలిపే
అద్భుతం
బయటికి తెస్తుంది మనలోని నైపుణ్యం
అక్షరం నిరుద్యోగులకు అవసరం
మన బంగారు కళలకు తొలి సోపానం
అక్షరం చెడు యొక్క వినాశనానికి శ్రీకారం
చేస్తుంది మంచిని అధికం
అక్షరం ఖండిస్తుంది మన కష్టం
కురిపిస్తుంది పొగడ్తల వర్షం
అక్షరం ధర్మానికి ప్రతిరూపం
జరిపిస్తుంది మనకు న్యాయం
అక్షరం అందరికీ మంచి చేసే స్నేహం
చూపిస్తుంది మనకు మంచి మార్గం
అక్షరం అష్టదరిద్రాలను
తొలగించే దైవం
తరిమికొడుతుంది నష్టం
అక్షరం ఒక ఆయుధం
కవుల పాలిట అది ఒక వరం
క్షరం కాని అక్షరం
అదే మనందరి మూలధనం

–పలిపే రామ్ చేతన్
7వ,తరగతి
9502156813

'గాలిని, కాలాన్ని, చైతన్యాన్ని తెలంగాణవైపు మళ్ళించిన జాతి వైతాళికుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్' జయంతి ఆరు ఆగష్టు సందర్భంగా తెలుగు భాషా చైతన్య సమితి సారథులు పి. బడేసాబ్, డా॥ వి.జయప్రకాశ్, డా॥ఎడ్ల కల్లేశ్ సంకలనకర్తలుగా ప్రొ॥ జయశంకర్ స్మారక కవితా సంకలనాన్ని ఈనెల 12 ఆదివారం ఉదయం హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో డా॥నందిని సిధారెడ్డి, డా॥ఏనుగు నరసింహారెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, బడేసాబ్ మరియు పలువురు అతిథుల సమక్షంలో ఆవిష్కరించబడింది. ఈ సంకలనంలోని మరిన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం...

–సంపాదకులు



జయ శంకరుడు

చరితార్థుడు జయశంకర్!

ప్రతి జననాని కి, మరణం తధ్యం
ఆరెంటి మధ్య బతికిన బతుకును
సార్థకత చేసుకున్నవాడేకదా మహనీయుడు!

తరతరాల పోరాటాలలో అలసిన తెలంగాణకు
ప్రత్యేక రాష్ట్రంగా, వెలిగేలా ఆవిరళ కృషి
జరిపిన అవిశ్రాంత యోధుడు జయశంకర్ జీ!

మానీరు,మానేల, మా వనరులు, మా బతుకులు
మా చేతికి ఇవ్వాలని, గులాబీ దండుతో,
ఎన్నో పోరాటాలు రచించిన నవతెలంగాణా
విరించి, కొత్తపల్లి జయశంకర్ జీ!

మా జనాలకోసం, బాగుకోసం యాచనచేయం,
మాఆత్మగౌరవాన్ని, నిలుపుకుంటూ, మా పాలకుల
అధికారంతో,బంగరు తెలంగాణా ని
నిర్మించుకుంటాం అని, కంకణ బద్ధుడై,
పోరు దశా, దిశ లను నిర్వచించిననిగర్వి జయశంకర్జీ
పల్లె పల్లెల్ని, కదలించి, పోరుబాటకు తెచ్చి,
తెలంగాణా ప్రజల ఆకాంక్ష ను, నెరవేర్చిన
శంకర్జీ! నీవు చరితార్థుడవయ్యా!
నీ ఆలోచనల బాట, కావాలి నేటి పాలకుల నోటిమాట
నీవు నమ్మినఆశయాలే పండాలి తెలంగాణా గడ్డమీద!

–బంధకవి శ్రీనివాసరామారావు
9440659726

ఆచార్యుడు

దగాపడ్డ తెలంగాణను
తెలివిడికి తెచ్చి,
వివరాలు,లెక్కలతో
విషయాలు ఎండగట్టి,
ప్రజాచైతన్యానికి భావజాలవ్యాప్తి చేసి,
విద్యావేత్తగా అన్యాయాలను ఎత్తిచూపి,
ఉపాధ్యాయుడిగా ఉద్యమానికి
ఊపిరులూది,
ఆచార్యుడిగా రాష్ట్ర సాధనకు
దిశానిర్దేశం చేసి,
ముల్కీనిబంధనలు,పెద్దమనుషుల ఒప్పందాలు,
విశాలాంధ్ర కుట్రలను బహిర్గతమొనరించి,
తెలంగాణ సాధనకు చాణక్యనీతి
ఉపయోగించి,
బలమైన నాయకత్వాన్ని ముందుండి
నడిపించి,
గమ్యాన్ని ముద్దాడిన జయశంకర్ సారు
నిజమైన తెలంగాణ జాతిపిత.

–డా.రామక కృష్ణమూర్తి
9948285353

తెలంగాణా ఉద్యమ వారధి

తెలంగాణ అస్తిత్వం కోసం
ఆరాట పడిన యోధుడు
తెలంగాణ మాగాణి లో పోరు విత్తనాలు
జల్లి పొలికేక పెట్టిన కర్షకుడు
సాహిత్య క్షేత్రంలో వికసించిన
విద్యా కుసుమ పరిమళ సుగంధం
తెలంగాణ ఉద్యమ వారధి
మలిదశ తెలంగాణ ఉద్యమ రథసారథి
ప్రొఫెసర్ జయశంకర్ సార్ .

నాన్ ముల్కీ పై పిడికిలి బిగించి
సబ్బండ వర్గాలను సమీకరించి
చైతన్య కిరణాలను రగిలించి
దోపిడి పెత్తనం పై దండోరా మోగించి
సమైక్య గుండెల లో భూకంపం లేపాడు
తెలంగాణా ప్రజల గుండెల్లో
కోవెలై నిలిచాడు.

గల్లీ నుండి ఢిల్లీ వరకు ప్రత్యేక
రాష్ట్ర కాంక్షను కోడై కూసాడు
ఎన్నో ఉద్యమాలకు ఊపిర్లు ఊది
ఎన్నో వేదిక లకు ప్రాణం పోసి
జీవితాన్ని తెలంగాణ కు ధారపోసిన
నిస్వార్థ సేవకుడు ,తెలంగాణా సిద్ధాంత
కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్

మా పచ్చని పైరులో
మీ రూపాన్ని చూసుకుంటాం
మా బిడ్డలకు మీ గుర్తులను ఎరకజేత్తం
మీ పోరాట స్ఫూర్తి ని ఎద నిండా
నిక్కచ్చిగా నిలుపుకుంటాం
మీ భావాలను ముందు తరాలకు
ఓపిక తో ఒంపుతాం
మీ మాటల్ని ఈటెలుగా మలచుకొని
వక్ర ప్రభుత్వాలపై
బరిగీసి కొట్లాడుతాం

–తాటిపాముల రమేష్
7981566031

అక్షరం

అక్షరం విశ్వ స్వరూపం
అక్షరం ఆనంద హేల
అక్షరం ఆమని రాగం
అక్షరం ప్రకృతి సూచిక.
అక్షర భావన
అనంత గమనం
అక్షర మిళితం
జీవన కాల చక్రం.
అక్షర జ్ఞానం
అభ్యుదయ పథం
అక్షరం ఓంకార విలాసం
అక్షరం ప్రగతికి ప్రతీక

(8 సెప్టెంబర్ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సంధర్భంగా).

–సుతారపు వెంకట నారాయణ
9848958690

నవ రత్నాలు - నూతన ఛందస్సు స్ఫూర్తి శిఖరం

చారిత్రక సైద్ధాంతిక
విషయమంత వింగడించి
రాష్ట్రకాంక్ష రగిలించిన
మేధోనిధి మేరు శిఖరం రాణప్ప..!

తెలంగాణ తెంపరితన
పోరాటము ఆరాటము
అణువణువున అలదుకున్న
ఆచార్యుడు ఆశయస్ఫూర్తి రాణప్ప..!

కొత్తపల్లి కొదమసింహ
గర్జనలే ఘన నినాద
సుస్పష్టపు విస్ఫోటన
జన జాగృతి జ్వాల లాయెను రాణప్ప..!

జయ శంకర జవ సత్వము
జన తంత్రము ఘన మంత్రము
కదిలించెను కదనానికి
రాష్ట్ర సిద్ధి రణ నాదమై రాణప్ప..!

తిరుగులేని ధృడ వైఖరి
నిలదీసిన నిఖార్సైన
దగా పడిన దండి ప్రజల
గోసనంత ఘోషించెను రాణప్ప..!

దోచుకునే దోపిడోళ్ళ
నిజరూపును నిగ్గదీసే
మోసబడ్డ గోసనంత
ఉద్యమాల ఊసులు జెప్పి రాణప్ప..!

జన యాతన తన బాధగ
నినాదమై నిలదీస్తూ
మేకవన్నె మృగ వైఖరి
దేశమంత దెలియ జెప్పెను రాణప్ప..!

పల్లవించె పల్లె పాట
గజ్జగట్టి జజ్జ నకరి
పోరు పాట హోరు బుట్టె
వంచకులకు వణుకు బుట్టెను రాణప్ప..!

చైతన్యము చేతనగా
మేనుతట్టి మేల్కొలిపెను
పల్లెటూళ్ళు తల్లడిల్లె
భగ్గుమనెను పట్నాలన్ని రాణప్ప..!

ఢిల్లి గుండె తల్ల డిల్లెగ్రాంతితొ
దిమ్మ దిరిగె
రాష్ట్ర కాంక్ష రగిలె చిచ్చు
జోరు పెరిగి హోరు బుట్టెను రాణప్ప..!

జయశంకర జైత్రయాత్ర
ఆశయమే ఆలంబన
తెలంగాణ తెగువ జూపె
కదిలించెను పది జిల్లాలు రాణప్ప..!

అరువదేండ్ల ఆందోళన
ఆర్భాటము ఆరాటము
స్వరాష్ట్రమై సాకారము
తెరలు వీడి తెలంగాణము రాణప్ప..!

పులకరించె పుడమి తల్లి
భారతి గళ హారమాయె
జయ జయహే జయ జననీ
జన జాగృత జై తెలంగాణ రాణప్ప..!
(ఇది నాచే సృష్టించబడిన
'నవరత్నాలు'నూతన
ఛందస్సులో రాయబడింది)

–వేంకట రాణాప్రతాప్
9398 432 567

తెలంగాణ సిద్ధాంతకర్త

సీ. మా:–
మా తెలంగాణము మాకు గావాలంటు
తెలగాణ రాష్ట్రము తేజ రిల్ల
చైతన్య పరిచియు చక్కగా యువతను
స్వరాష్ట్ర సిద్ధికై సమిధ యయ్యె
మలిదశ ఉద్యమ మార్గదర్శకుడయ్యి
ప్రాభాత సూర్యుడై ప్రజ్వ రిల్లె
తెలగాణ రాష్ట్రము కలను సాకారము
జేయ సంకల్పించె శ్రీకర ముగను
జయశంకర్ సారు జయము పొంద
దీక్ష చేపట్టెను ధీరుడగుచు
తెలగాణ సిద్ధికై తెగువతో కొట్లాడి
ఉద్యమానికితడు ఊత మయ్యె
జ్ఞానవంతుడయిల ఘనుడుగా పేరొంది
సిద్ధాంత కర్తగా శ్రేష్టు డయ్యె
తెలగాణ పితయంటు పిలవగా జనులంత
ప్రజల హృదిని నిల్చె భవ్యు డగుచు

ఆ.వె:–
తల్లడిల్లుతున్న తల్లి తెలంగాణ
అనుచు రచన జేసి హృదము నొందె
బ్రహ్మచారి గానె భాసిల్లి ధరలో
సేవజేసియిల న జేయు డయ్యె !

–